ఆదివారం
05-03-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 252
పేజీలు : 8, వెల: రూ.6.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

పేద దేశాలను ఆదుకోవాల్సిందే...

పేద దేశాలను సంపన్న దేశాలు తొక్కేస్తున్నాయని ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రెస్ తీవ్రస్థాయిలో ఆందోళన వ్యక్తంచేశారు. తీవ్రమైన వడ్డీ రేట్లు, చమురు ధరలను తొక్కేస్తూ పేదల దేశాలపై సంపన్న దేశాలు, చమురు దిగ్గజాలు ప్రతాపం చూపుతుండటం ఆక్షేపణీయమని నొక్కిచెప్పారు.

2లో

మళ్లీ కూల్చివేతలు

- గ్రామస్తుల ఆందోళన
- ఇప్పటంలో ఉద్రిక్తత
- భారీగా పోలీసుల మోహరింపు

విశాలాంధ్ర-తాడేపల్లి: గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం ఇప్పటంలో ఇళ్ల కూల్చివేత ఉద్రిక్తతకు దారితీసింది. శనివారం ఉదయం రెండు బస్సుల్లో ఇప్పటం చేరుకున్న పోలీసులు... గ్రామంతో పాటు సరిహద్దుల్లోనూ మోహరించారు. క్రేన్లు, జేసీబీలతో గ్రామానికి వచ్చిన అధికారులు ఇళ్ల కూల్చివేతలు మొదలుపెట్టారు. నిబంధనలు అతిక్రమించి ప్రహరీ గోడలు నిర్మించారంటూ అధికారులు నిర్మాణాలు కూల్చివేశారు. 12 ఇళ్ల ప్రహరీ గోడలను ఇప్పటికే నగర పాలక సంస్థ అధికారులు కూలగొట్టారు. గ్రామస్తుల తీవ్ర నిరసనల మధ్యే నిర్మాణాల తొలగింపు ప్రక్రియ కొనసాగింది. గతంలో కొన్ని ఇళ్లను తొలగించిన అధికారులు...మరోసారి ఇళ్లు కూల్చేందుకు చర్యలు తీసుకోవటంపై స్థానికులు మండిపడ్డారు. ముందస్తు నోటీసులు ఇవ్వకుండా ఇళ్లను ఎలా కూలగొడతారని అధికారులని నిలదీశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా భారీగా పోలీసులను మోహరించారు. గ్రామ సరిహద్దుల్లోనూ పహారా పెట్టారు. గ్రామంలోకి వచ్చే వారిని క్షుణ్ణంగా తనిఖీ చేసి, వివరాలు నమోదు చేసుకొని పంపిస్తున్నారు. అక్రమంగా తమ ఇళ్లను తొలగిస్తున్నారంటూ స్థానికులు ఆందోళనకు దిగారు. పోలీసులు రంగంలోకి దిగి ఆందోళన చేస్తున్న కొంతమందిని అదుపులోకి తీసుకున్నారు. ఆక్రమణల పేరుతో ఉద్దేశపూర్వకంగానే ఇళ్లు తొలగిస్తున్నారని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగానే ఆక్రమణలు తొలగిస్తున్నామని అధికారులు వివరించారు. నోటీసులు ఇచ్చామని అధికారులు పేర్కొంటుండగా... అలాంటివేమీ ఇవ్వలేదని గ్రామస్తులు అంటున్నారు. మున్సిపల్ అధికారులు ఒక్క ఇప్పటం గ్రామంలోనే పనిచేస్తున్నారా అని గ్రామస్తులు ప్రశ్నించారు. నగరపాలక సంస్థ పరిధిలోని అనేక చోట్ల అక్రమ కట్టడాలు ఉన్నాయని, వాటిని తొలగించకుండా, అనేక సంవత్సరాలుగా నివాసం ఉండే తమపై కక్ష పెంచుకుని తొలగిస్తున్నారని ఆరోపించారు. గ్రామంలో 70 అడుగుల రోడ్డు అవసరం లేదని చెప్పారు. జనసేన ఆవిర్భావ సభ ఇప్పటంలో జరిగిన నాటి నుంచి వైసీపీ ప్రభుత్వం తమను లక్ష్యంగా చేసుకుందని విమర్శించారు. గ్రామానికి రవాణా సౌకర్యం లేదని, బస్సులు రావని, భారీ వాహనాలు ఇక్కడ నుంచి వెళ్లవని చెబుతున్న గ్రామస్తులు... రోడ్డు విస్తరణతో ఏమి చేస్తారని నిలదీశారు. స్థానికులకు జనసేన, టీడీపీ నేతలు మద్దతు తెలిపారు. గ్రామస్తులకు న్యాయం చేయాలంటూ జనసేన నేతలు నిరాహారదీక్షకు దిగారు. రామాలయంలో దీక్షకు దిగారు. ఇళ్లు కూల్చబోమని హామీ ఇచ్చిన తర్వాతే దీక్ష విరమిస్తామని స్పష్టం చేశారు. కూల్చివేసిన ప్రతి ఇంటికీ పరహారం ఇచ్చే వరకు పోరాటం కొనసాగుతుందని జనసేన పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు చెప్పారు.

మరింత ముందుకు

- మీ నమ్మకాన్ని వమ్ము చేయం
- ఒప్పందాల అమలు దిశగా ప్రతివారం కమిటీ సమీక్ష
- 352 ఒప్పందాలకు రూ.13,05,663 కోట్లు
- ప్రపంచ పెట్టుబడిదారుల సదస్సు ముగింపు సభలో సీఎం జగన్

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: మీ విశ్వాసంతో మరింత ముందుకు వెళతామని, మీ నమ్మకాన్ని వమ్ము చేయమని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. విశాఖ వేదికగా నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ 2023 రెండు రోజుల సదస్సు శనివారం ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన సభలో వైఎస్ జగన్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సును విజయవంతం చేసిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ సదస్సు ద్వారా వచ్చిన ఆత్మవిశ్వాసం తనను మరింత ఉప్పొంగేలా చేసిందన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు మరింత వృద్ధి చెందేందుకు కృతనిశ్చయంతో ఉన్నామని చెప్పారు. పారిశ్రామిక వేత్తలు, వ్యాపారస్తులు నిర్వహించే కార్యకలాపాలకు తమ నుంచి చక్కటి మద్దతు, సహకారం ఉంటుందని, మీతో తమ బంధం చాలా అమూల్యమైనదన్నారు. రాష్ట్రంలో పారిశ్రామిక రంగానికి మరింత సానుకూల వాతావరణం కల్పించడానికి ఈ సదస్సు అద్భుతంగా ఉపయోగపడుతుందన్నారు. ఈ దిశగా చేస్తున్న ప్రయత్నాలను రెట్టింపు చేయడానికి ఈ సదస్సు కల్పించిన వాతావరణం ప్రోత్సాహాన్ని ఇస్తుందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడున్నర సంవత్సరాల్లో ఆర్థిక వ్యవస్థ శరవేగంతో తిరిగి పుంజుకుందని, కోవిడ్ మహమ్మారి విస్తరించి, ఆర్థిక వ్యవస్థ అల్లకల్లోలమైన పరిస్థితులలో కూడా అనేక రంగాలకు తమ ప్రభుత్వం సమయానుకూలంగా ప్రోత్సాహం ఇచ్చిందని తెలిపారు. సుపరిపాలన, సమర్థవంతమైన విధానాలు ఆర్థిక వ్యవస్థకు రక్షణగా నిలవడమే కాకుండా ద్రవ్య లోటును నియంత్రణలో ఉంచాయని అన్నారు. అంతేకాకుండా వ్యాపారాలు ప్రమాదంలో పడకుండా చూసిందని అన్నారు. మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడమే కాకుండా ఇంటర్‌నెట్, బ్రాడ్‌బాండ్‌ను అందుబాటులోకి తీసుకువచ్చి యువతలో నైపుణ్యాలు మరింత మెరుగయ్యేలా చేశామని ఆయన చెప్పారు. ఈ సదస్సులో వివిధ రంగాలపై 15 సమావేశాలు నిర్వహించామని, 100 మందికి పైగా మాట్లాడారని, ఆంధ్రప్రదేశ్‌కు ఉన్న బలాలేంటో చెప్పారని అన్నారు. ఆటో మొబైల్, ఈవీ, హెల్త్‌కేర్, మెడికల్ ఎక్విప్‌మెంట్, రెన్యువబుల్ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమోనియా, అగ్రి ప్రాసెసింగ్, పర్యాటకం తదితర రంగాలు ఇందులో ఉన్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌తో సహకారం కోసం మరిన్ని అవకాశాలు అన్వేషించేందుకు యూఏఈ, నెదర్లాండ్స్, వియత్నాం, వెస్టర్న్ ఆస్ట్రేలియాతో మరో నాలుగు చర్చా గోష్ఠులు కూడా నిర్వహించామన్నారు. సదస్సులో ప్రత్యేకంగా ఎగ్జిబిషన్ ఎరీనా

- మిగతా 2 లో

అదానీకి గుత్తాధిపత్యం ఎలా ఇస్తారు: మోదీకి కాంగ్రెస్ సూటి ప్రశ్న

8లో

యాంటీబయోటిక్స్ వాడొద్దు

- ఐఎంఏ సూచన
- హెచ్3ఎన్2తో పెరుగుతున్న జ్వరం, దగ్గు పీడితులు : ఐసీఎంఆర్

న్యూఢిల్లీ: దేశంలో రెండు, మూడు నెలలుగా ఇన్‌ఫ్లుయెంజా-ఎ సబ్‌టైప్ హెచ్3ఎన్2 వల్ల జ్వరం, దగ్గు, జలుబు పీడితుల సంఖ్య పెరుగుతున్నట్లు భారత వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్) పేర్కొంది. ఇతర సబ్ టైపుల కంటే హెచ్3ఎన్2 వల్ల ఆసుపత్రుల్లో చేరికలు ఎక్కువని ఐసీఎంఆర్ శాస్త్రవేత్తలు తెలిపారు. వైరస్ బారిన పడకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలనూ వారు సూచించారు. వీరంతా వైరస్

- మిగతా 2 లో

ఎస్ఎస్‌పీ ఎడమ కాలువ పరిశీలన

చింతలపూడిలో...

ప్రాజెక్టులను గాలికి వదిలేశారు

- రూ.20 వేల కోట్లు కేటాయించాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ
- చింతలపూడి, విస్సన్నపేటలో పార్టీ బృందం పర్యటన

విశాలాంధ్ర-చాట్రాయి/విస్సన్నపేట టౌన్: జగన్ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులను గాలికొదిలేసిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి తక్షణమే రూ.20 వేల కోట్ల నిధులు కేటాయించాలని, చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులు వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఏలూరు జిల్లా చాట్రాయి మండలం చీపురుగూడెం తమ్మిలేరులో చింతలపూడి ఎత్తిపోతల పథకం రెండోదశ పనులను, ఎన్‌టీఆర్ జిల్లా విస్సన్నపేట మండలంలోని ఎస్ఎస్‌పీ ఎడమకాలువ మూడవ జోన్ నుంచి రైతులకు నీటినందిస్తున్న తీరును సీపీఐ బృందం శనివారం పరిశీలించింది.

అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణ పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయని విమర్శించారు. ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాల్లో మెట్ట ప్రాంతానికి అత్యంత ప్రాధాన్యత గల చింతలపూడి ఎత్తిపోతల పథకం మొదటి, రెండో దశ పనులు నిలిచిపోయాయన్నారు. దీనివలన రెండు జిల్లాల తాగు, సాగునీరు సమస్య పరిష్కారమయ్యేదని, ఈ విషయం తెలిసినా రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్రపోతోందన్నారు. చింతలపూడి ఎత్తిపోతలకు ఇప్పటికే రూ.3500 కోట్లు ఖర్చు చేశారని, మరో వెయ్యి కోట్ల రూపాయల నిధులు కేటాయించి పనులు చేస్తే పూర్తవుతుందన్నారు. ఫిబ్రవరి 13వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా గల నీటిపారుదల ప్రాజెక్టులను పరిశీలిస్తున్నామన్నారు. రూ.2.50 లక్షల కోట్ల బడ్జెట్‌లో ప్రాజెక్టులకు రూ.20 వేల కోట్లు ఎందుకు కేటాయించకూడదని ప్రశ్నించారు. పోలవరం జాతీయ ప్రాజెక్టు అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వడం లేదన్నారు. రాజకీయ పక్షపాతంతో కర్ణాటక ప్రభుత్వానికి రూ.5300 కోట్లు ఇచ్చిందని గుర్తు చేశారు. పోలవరం నిర్వాసితుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నాగార్జునసాగర్ మూడో జోన్‌లో లెక్క ప్రకారం నీటి వాటాను రాబట్టాలన్నారు.

ఎన్‌టీఆర్ జిల్లా విస్సన్నపేట మండలంలో

- మిగతా 2 లో

ధరల మోత

- పాలు... గ్యాస్ నుంచి పన్నుల వరకు
- విద్యుత్ చార్జీలు... వైద్యం ఖర్చులదీ అదే దారి
- పేద, మధ్యతరగతిపై భారం

న్యూఢిల్లీ : దేశంలో ధరల మోత మోగుతోంది. పాలు నుంచి వంట గ్యాస్ వరకు... పన్నుల నుంచి వైద్య ఖర్చుల వరకు అన్ని వ్యయాలు భారీగా పెరిగిపోవడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు విలవిల్లాడిపోతున్నారు. పెరిగిన ఖర్చులకు అనుగుణంగా ఆదాయాలు లేకపోవడంతో నెల నెలా భారం పెరుగుతూనే ఉంది. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలతో పాటు ఇంటి అద్దెలు, విద్యుత్ చార్జీలు, సొంతిల్లు కలిగిన వారికి ఆస్తి పన్నులు, విద్య, వైద్యంలో పెరిగిన ఖర్చులు, కూరగాయలు, పాలు ఇతర నిత్యావసర ధరలతో అన్ని తరగతుల ప్రజలు కుదేలవుతున్నారు. కుటుంబ పోషణ కోసమే ఇబ్బందులు పడుతున్న పరిస్థితులు ఏర్పడ్డాయి. ఉల్లిపాయలు కిలో రూ.30, టమోటా రూ.40, మిర్చి రూ.60, బెండకాయలు రూ.60 ఇలా అన్ని రకాల కూరగాయల ధరలు ఎక్కువగానే ఉన్నాయి. ఐదుగురు కుటుంబ సభ్యులున్న ఇంటికి రోజుకు కేవలం కూరగాయలకే రూ.100లకు పైగా ఖర్చవుతోంది. వీటితో పాటు వంట నూనె లీటరు రూ.170 నుంచి రూ.190 వరకూ పెరిగింది. మేలు రకం బియ్యం కిలో రూ.50 నుంచి రూ.60 వరకూ ఉంటుంది. కందిపప్పు, మినపప్పు, పెసర పప్పులదీ అదే దారే. కీలకమైన వంట గ్యాస్ ధరను ప్రజలు భరించలేనంతగా మోదీ ప్రభుత్వం పెంచుకుంటూ పోతోంది. ప్రస్తుతం గ్యాస్ రీఫిల్ సిలిండర్ ధర రూ.1,152 అయింది. డెలివరీ ఖర్చుతో కలుపుకుంటే రూ.1,200 అవుతుంది. పెట్రోల్, డీజిల్ ధరలు రూ.112, రూ.100 నుంచి దిగువకు రాని పరిస్థితి ఉంది. అలాగే

- మిగతా 2 లో

ఇదీ లోకం!

అన్ని పెట్టుబడులు వస్తున్నాయంటే తట్టుకోలేక పోతున్నాడు, పాపం!

ప్రపంచ శాంతి కోసం కృషి చేద్దాం

- రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో నాటో కూటమి జోక్యం తగదు
- శాంతి సంఘం జాతీయ మహాసభల్లో వక్తల ఉద్ఘాటన

(చండీగఢ్ నుంచి మోతుకూరి అరుణకుమార్)

ప్రపంచంలోని వివిధ దేశాల మధ్య నెలకొన్న యుద్ధ వాతావరణాన్ని అణచివేసి...శాంతి నెలకొల్పాల్సిన అవసరం ఉందని, అణుయుద్ధం వస్తే మానవ వినాశనం తప్పదని అంతర్జాతీయ శాంతి సంఘీభావ సంఘం అధ్యక్షుడు పల్లబ్‌సేన్ గుప్త చెప్పారు. రష్యా-ఉక్రెయిన్ దేశాల మధ్య ఏడాదికి పైగా సాగుతున్న యుద్ధానికి సామ్రాజ్యవాద నాటో దేశాలు మరింత ఆజ్యం పోస్తున్నాయని విమర్శించారు. అఖిలభారత శాంతి సంఘీభావ సంఘం (అయిప్సో) జాతీయ మహాసభలు చండీగఢ్‌లోని స్థానిక పంజాబ్, హరియాణా బార్ కౌన్సిల్ భవన్‌లో శనివారం ప్రారంభమయ్యాయి. రెండు రోజులు జరిగే ఈ సభల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు తమిళనాడు, పశ్చిమబెంగాల్, కేరళ, పంజాబ్, హరియాణా, బీహార్, ఒడిశా, త్రిపుర, ఢిల్లీ, హిమాచల్‌ప్రదేశ్, మణిపూర్ రాష్ట్రాల నుండి 300 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. మహాసభల ప్రారంభ సూచికగా సభా ప్రాంగణం వద్ద జాతీయ పతాకాన్ని ఆహ్వానసంఘం చైర్మన్ ప్రొఫెసర్ హెచ్ఎస్ సిద్ధు,

- మిగతా 2 లో

ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆందోళనకు మద్దతుగా
9,10 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు

- పార్టీ శ్రేణులకు సీపీఐ, సీపీఎం పిలుపు
- పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్

2లో

రష్యన్ శాస్త్రవేత్త ఆండ్రే బొటికోవ్ హత్య

నిందితుడి అరెస్టు

మాస్కో: కోవిడ్ వైరస్ కోసం తయారు చేసిన స్పుత్నిక్ వాక్సిన్ సృష్టికర్తల్లో ఒకరైన ప్రముఖ రష్యన్ శాస్త్రవేత్త ఆండ్రే బొటికోవ్ (47)దారుణ హత్యకు గురయ్యారు. ఆయన అపార్టుమెంటులోనే ఈ ఘటన జరిగిందని, బెల్ట్‌తో గొంతు నొక్కేసి ప్రాణాలు తీశారని పోలీసులు తెలిపారు. శాస్త్రవేత్త హత్యతో సంబంధమున్న ఒక నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు శనివారం రష్యా మీడియా వెల్లడించింది. బొటికోవ్ గురువారం తన అపార్ట్‌మెంట్‌లో విగతజీవిగా కనిపించినట్లు రష్యాన్ వార్తా సంస్థ టీఏఎస్ఎస్ వెల్లడించింది. ఈ మేరకు రష్యన్ ఫెడరేషన్ ఆఫ్ ఇన్వెస్టిగేటివ్ కమిటీ పేర్కొన్నట్లు తెలిపింది. బొటికోవ్ సీనియర్ పరిశోధకులు, గ్లోమలేయా జాతీయ పరిశోధన కేంద్రం (ఎకోలజీ, మ్యాథమేటిక్స్)లో పనిచేసేవారు. 2020లో స్పుత్నిక్ వి వాక్సిన్‌ను తయారు చేసిన 18 మంది శాస్త్రవేత్తల్లో ఈయన ఒకరు కాగా 2021లో ఫాదర్ లాండ్ అవార్డ్‌తో అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సన్మానాన్ని కూడా అందుకున్నారు. వాగ్వాదం క్రమంలో 29 ఏళ్ల వ్యక్తి బెల్ట్‌తో శాస్త్రవేత్త గొంతును నొక్కేసి హత్య చేశాడని, ఆపై పరారయ్యాడని ప్రాథమిక దర్యాప్తులో తేలింది. నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారించగా అతను తన నేరాన్ని అంగీకరించినట్లు ఫెడరల్ దర్యాప్తు సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది.

అమెరికాలో ఎక్స్‌బీబీ.1.15 విజృంభణ

కొత్త కోవిడ్ కేసుల్లో 90 శాతం ఇవే

వాషింగ్టన్: అమెరికాలోఒమిక్రాన్ సబ్‌వేరియంట్ ఎక్స్‌బీబీ.1.5 విజృంభిస్తోంది. సరవేగంగా వ్యాప్తి చెందుతూ ఇప్పటికే దేశవ్యాపితంగా అనేకమందిని ఆవహించింది. కొత్తగా నమోదయ్యే కోవిడ్ కేసుల్లో 90శాతం మేరకు ఈ సబ్ వేరియంట్ కేసులనే గుర్తించినట్లు వ్యాధి నివారణ, నిరోధక కేంద్రం (సీడీసీ) తెలిపింది. గతేడాది నుంచి ఇప్పటివరకు ఎక్స్‌బీబీ.1.5 కేసులు క్రమంగా పెరిగాయని పేర్కొంది. దేశంలో నమోదైన కొత్త కోవిడ్-19 కేసుల్లో 89.2శాతం ఎక్స్‌బీబీ.1.5 కేసులు ఉంటే గత వారంలో 85.4శాతం, రెండు వారాల కిందట 79.7శాతం కేసులు నమోదైనట్లు జిన్హువా వార్తా సంస్థ వెల్లడించింది. మరో వైరస్ బీక్యూ.1.1 కేసులు కూడా పెరుగుతున్నాయని, ఇప్పటివరకు 6.7శాతం కేసులు దీనికి సంబంధించవిగా గుర్తించినట్లు నివేదిక పేర్కొంది. గతేడాది నవంబరులో ఎక్స్‌బీబీ.1.5 కేసుల ట్రాకింగ్‌ను సీడీసీ మొదలు పెట్టగా, అప్పట్లో ఒకశాతం కంటే తక్కువగా కేసులు దేశంలో ఉన్నాయి. ఆ తర్వాత అమెరికా అంతటా కేసులు చాలా వేగంగా పెరిగాయి. వ్యాప్తిగతి ఎక్కువే అయినా తీవ్రమైన వ్యాధి లక్షణాలు లేవని శాస్త్రవేత్తలు తెలిపారు. ఎక్స్‌బీబీ.1.5కు చెందిన రెండు మ్యుటేషన్లు కూడా వేగంగా వ్యాప్తి చెందుతున్నట్లు అధ్యయనంలో తేలింది.

పేద దేశాలను ఆదుకోవాల్సిందే...

- సంపన్న దేశాల దుర్నీతి ఆక్షేపణీయం
- ఇచ్చిన హామీలు నిలబెట్టుకోని అగ్రరాజ్యాలు
- ఎల్‌డీసీ సదస్సులో గుటెర్రస్

దోహా: పేద దేశాలను సంపన్న దేశాలు తొక్కేస్తున్నాయని ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రస్ తీవ్రస్థాయిలో ఆందోళన వ్యక్తంచేశారు. తీవ్రమైన వడ్డీ రేట్లు, చమురు ధరలను తొక్కేస్తూ పేదల దేశాలపై సంపన్న దేశాలు, చమురు దిగ్గజాలు ప్రతాపం చూపుతుండటం ఆక్షేపణీయమని నొక్కిచెప్పారు. ప్రపంచంలోనే అణగారిన రాజ్యాల సదస్సులో గుటెర్రస్ మాట్లాడుతూ డిజిటల్ విప్లవంలో వల్ల పేద దేశాలు మరుగున పడ్డాయన్నారు. ఉక్రెయిన్ యుద్ధం వల్ల ఆహారం, చమురు/ఇంధన ధరలు మరింతగా పెరిగాయని గుటెర్రస్ తెలిపారు. సంపన్న దేశాలు ఏటా 500 బిలియన్ డాలర్ల ఆర్థిక సాయాన్ని పేద దేశాలుకు అందజేయాల్సి ఉందని, ఆ మేరకు ఇచ్చిన హామీ అమలులో అగ్రరాజ్యాలు విఫలమయ్యాయన్నారు. సంపన్నుల దుర్నీతితో పేద దేశలు తమ ఆర్థిక, ఆరోగ్య, విద్యా వ్యవస్థలను మెరుగు పర్చుకోలేకపోతున్నట్లు గుటెర్రస్ వెల్లడించారు.

46 అత్యల్ప అభివృద్ధి దేశాల (ఎల్‌డీసీ) సదస్సును పదేళ్లకొకసారి జరుగుతుంది. అయితే కోవిడ్ కారణంగా 2021 నుంచి రెండుసార్లు వాయిదా పడింది. అఫ్ఘన్, మియన్మార్ రెండూ పేద దేశాలే అయినా దోహా సదస్సుకు దూరంగా ఉన్నాయి. ఈ దేశాలను ఐరాస గుర్తింపు లభించలేదు. ప్రపచంలోని అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల నుంచి ఏ ఒక్క నాయకుడు కూడా ఎల్‌డీసీ సదస్సుకు హాజరు కాలేదు.

సదస్సును గుటెర్రస్ ప్రారంభిస్తూ శక్తిమంతులు, బలహీనులను తొక్కేస్తున్నారన్నారు. వనరులు లేక, అప్పుల్లో మునిగి, వివక్షపూరిత కోవిడ్ ప్రతిస్పందన వల్ల అన్యాయమైన దేశాలలో ఆర్థికాభివృద్ధి ఓ పెద్ద సవాలని నొక్కిచెప్పారు. తమకు కోవిడ్ వాక్సిన్‌ల సముచిత వాటా లభించలేదని ఎల్‌డీసీ దేశాలు మొరపెట్టుకున్నాయి. ఏమీ చేయకపోయినా వాతావరణ మార్పు పరిణామాలను ఎదుర్కొంటూ మూల్యాన్ని చెల్లించుకుంటున్నాయి. ధరలు ఆకాశాన్నంటిన వేళ ఈ దేశాలకు అందే ఆర్థిక సాయం సుముద్రంలో నీటిచుక్కతో సమానం. శిలాజ ఇంధన దిగ్గజాలు భారీగా లాభాలు గడిస్తుంటే ఈ దేశాల్లో ఆకలి కేకలు వినిపిస్తున్నాయి. లక్షలాది మంది పస్తులు ఉంటున్నాయని గుటెర్రస్ అన్నారు.

'ప్రపంచ ఆర్థిక వ్యవస్థను సంపన్న దేశాలు తమకు ప్రయోజనమిచ్చేలా తయారు చేసుకున్నారు. పెట్టుబడులు లేవు, అధిక వడ్డీరేట్లలో ఎందరో కేపిటల్ మార్కెట్ల పక్కకు వెళ్లలేకపోతున్నారు. ఎల్‌డీసీలకు తమ స్థూల జాతీయ ఆదాయంలో నుంచి 0.15-0.20 శాతం ఇవ్వాల్సిన సంపన్న దేశాలు తమ హామీని నిలబెట్టుకోలేదు. పేదరికం, వివక్ష, అన్యాయం కారణంగా పేద దేశాల వెతలు వర్ణనాతీతమయ్యాయి. ఎల్‌డీసీలకు తమ సమస్యలను పరిష్కరించుకోవడం, పరిశ్రమల్లో ఉద్యోగాలు సృష్టించుకోవడం, రుణాలు చెల్లించుకోవడం కోసం కనీసం 500 బిలియన్ డాలర్ల ఆర్థిక సాయం ఏటా అవసరం. వాతావరణ మార్పు నేపథ్య పోరాటంలో పేద దేశాలకు కొన్ని వందల బిలియన్ల డాలర్ల సాయం చేస్తామన్న సంపన్న దేశాలు మాట నిలబెట్టుకోలేకపోతున్నాయి. హామీల అమలు కోసం ఐక్యరాజ్య సమితి ఎప్పుడూ ఒత్తిడి చేస్తుంటుంది' అని గుటెర్రస్ అన్నారు.

ఎల్‌డీసీల సదస్సు చైర్మన్, మాలవి అధ్యక్షుడు లాజరస్ చక్వేరా మాట్లాడుతూ పేద దేశాలకు ఆర్థిక తోడ్పాటును అందించడం సంపన్న దేశాల నైతిక బాధ్యతేగానీ వారికిచ్చే దానం కాదని అన్నారు. కరవు పీడిత దేశాలు, ఆకలి రాజ్యాలకు సాయం చేసేందుకు ఫుడ్‌స్టాక్‌హోల్డింగ్ సిస్టమ్ ఏర్పాటు చేసేలా దోహా ప్రోగ్రామ్ ఆఫ్ యాక్షన్ ప్రతిపాదించింది. ఎల్‌డీసీలు విదేశీ నిధులను ఆకర్షించేందుకు వీలుగా పెట్టుబడుదల కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, రుణాల ప్రభావాన్ని తగ్గించేందుకు వడ్డీ రేట్లు తగ్గించాలని కూడా ప్రతిపాదించింది.

ప్రపంచ శాంతి కోసం కృషి చేద్దాం

(మొదటిపేజీ తరువాయి)

అయిప్సో పతాకాన్ని పల్లబ్‌సేన్ గుప్త ఎగురవేశారు. మహాసభను పంజాబ్ హరియాణా రాష్ట్రాల హైకోర్టు సీనియర్ న్యాయవాది ఆర్ఎస్ చీమా లాంఛనంగా ప్రారంభించారు. వియత్నాం, క్యూబా, అమెరికా, నేపాల్, శ్రీలంక, బంగ్లాదేశ్ దేశాల నుండి శాంతి ఉద్యమ నాయకులు పాల్గొని సౌహార్థ సందేశం ఇచ్చారు. పల్లబ్‌సేన్ గుప్త మాట్లాడుతూ సోషలిస్టు, కమ్యూనిస్టు దేశాలపై అమెరికా వంటి సామ్రాజ్యవాద దేశాల ఆంక్షలు, చిన్న దేశాలు, ఇస్లామిక్ దేశాలపై దాడులు సాగిస్తూ తమ ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్నాయని అన్నారు. సిద్ధూ, చీమా ప్రసంగిస్తూ జాతీయంగా, అంతర్జాతీయంగా నెలకొన్న సామ్రాజ్యవాదం, ఫాసిజం, మతోన్మాదం, ఆర్థిక సంక్షోభం, పర్యావరణ సమతుల్యత లోపించడం నేపథ్యంలో శాంతి ఉద్యమాల ఆవశ్యకత ఎంతైనా ఉందని అన్నారు. దేశ స్వాతంత్ర్యం, రెండవ ప్రపంచ యుద్ధం, హిరోషిమా-నాగసాకిపై అణుదాడుల తర్వాత ప్రపంచ దేశాల మధ్య శాంతి, ఐక్యత కోసం 1951లో ఆలిండియా పీస్ కౌన్సిల్ ఏర్పడి 1972 నుండి అఖిల భారత శాంతి సంఘీభావ సంఘంగా రూపాంతరం చెందిందని, రాజకీయాలకు ఏ మాత్రం సంబంధం లేకుండా విశాల దృక్పథంతో సంఘం పనిచేస్తోందని వివరించారు. సైఫుద్దీన్, మాళవీయ, అరుణ అసఫాలీ, పండిట్ సుందర్ లాల్, అజయ్ ఘోష్, ఏకే గోపాలన్, డీడీ కోశాంబి, పృథ్వీరాజ్ కపూర్, కిషన్ చందర్, ముల్క్‌రాజ్ ఆనంద్, వీకే కృష్ణ మీనన్ వంటి అనేకమంది ఈ సంఘానికి నాయకత్వం వహించారని నాయకులు గుర్తు చేశారు.

పంజాబ్ సంప్రదాయంలో ప్రదర్శించిన నృత్యం సభికుల్ని అలరించింది. మధ్యాహ్నం జరిగిన ప్రతినిధుల సభలో శాంతి ఉద్యమం, ప్రగతిశీల ఉద్యమంలో సేవలందించి మరణించిన వారికి శాంతి సంఘం జాతీయ కార్యదర్శి అరుణ్ కుమార్ సంతాప తీర్మానం ద్వారా శ్రద్ధాంజలి ఘటించారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ హిందుత్వ అజెండా అమలు చేస్తోందని, విద్యారంగంలో పురాణం, జ్యోతిష్యం ప్రవేశపెట్టి పూర్తిగా కాషాయీకరణ చేస్తోందని విమర్శించారు. సాయంత్రం పంజాబ్‌లో నాటి, నేటి పరిస్థితులపై సదస్సు నిర్వహించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. మహాసభలో అయిప్సో జాతీయ కమిటీ సభ్యులు సుధాకర్, యాదవరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ నుండి సంఘం రాష్ట్ర కన్వీనర్లు మహంకాళి సుబ్బారావు, ఎస్.సతీష్ కుమార్, సీనియర్ నాయకులు ఆర్.పిచ్చయ్య, మోతుకూరి అరుణకుమార్, ఇమామ్, ఎం.సాయి కుమార్ ప్రతినిధులుగా హాజరయ్యారు.

యాంటీబయోటిక్స్ వాడొద్దు

(మొదటిపేజీ తరువాయి)

పరిశోధనలు, డయాగ్నాస్టిక్ ల్యాబ్ నెట్వర్క్ ద్వారా శ్వాస సంబంధిత వైరస్‌ల వల్ల వచ్చే రోగులను అధ్యయనం చేసే శాస్త్రవేత్తలు. మరోవైపు యాంటీ బయోటిక్స్‌కు దూరంగా ఉండాలని భారత వైద్య మండలి (ఐఎంసీ) సూచించింది. దగ్గు, జ్వరం, వికారం, గొంతు నొప్పి, ఒళ్లు నొప్పులు, విరేచనాల వంటి లక్షణాలతో బాధపడుతున్న వారి సంఖ్య ఇటీవల పెరిగిందని పేర్కొంది. 'సీజనల్ జ్వరాలు సాధారణంగా ఐదు నుంచి ఏడు రోజులు ఉంటాయి. మూడు రోజుల తర్వాత జ్వరం తగ్గుతుంది. కానీ దగ్గు మూడు వారాల వరకు ఉండొచ్చు' అని యాంటీ-మైక్రోబియల్ రెసిస్టెన్స్‌కు సంబంధించిన ఐఎంఏ స్టాండింగ్ కమిటీ వెల్లడించింది. హెచ్3ఎన్2 ఇన్ఫ్లుయెంజా వైరస్ వల్ల ఈ కేసులు వస్తున్నాయని తెలిపింది. 'జ్వరం, జలుబు, దగ్గు వంటి లక్షణాలు కనిపించగానే అజిత్రోమైసిన్, అమోగ్జిక్లావ్ వంటి యాంటీ బయోటిక్స్‌ను వినియోగించడం మామూలైంది. ఎంత డోసు తీసుకోవాలి.. ఎంత తేడాలో తీసుకోవాలనే దానిపై ఎవరూ శ్రద్ధ చూపడం లేదు. వ్యాధి లక్షణాలు తగ్గగానే యాంటీ బయోటిక్స్ వాడకాన్ని ఆపేస్తారు. దాంతో యాంటి బయోటిక్స్ నిరోధక శక్తి సూక్ష్మజీవులకు లభిస్తుంది. శరీరానికి అవసరమైనప్పుడు యాంటీ బయోటిక్స్ పని చేయవు' అని ఐఎంఏ హెచ్చరించింది. అమోక్సీసిలిన్, నోర్‌ఫ్లోక్సాసిన్, సిప్రోఫ్లోక్సాసిన్, ఓఫ్లోక్సాసిన్, లెవ్‌ఫ్లోక్సాసిన్ వంటి యాంటీ బయోటిక్స్ ఎక్కువగా దుర్వినియోగమవుతున్నట్లు తెలిపింది. వీటిని యూటీఐ, డయేరియా చికిత్సలో వాడరని పేర్కొంది.

కోవిడ్ సమయంలో అజిత్రోమైసిన్, ఐవర్మెక్టిన్ వంటి యాంటీ బయోటిక్స్‌ను విరివిగా వినియోగించారు. వీటి ద్వారా రెసిస్టెన్స్ పెరిగింది. వ్యాధి బ్యాక్టీరియా ద్వారా వచ్చిన ఇన్ఫెక్షన్ అవునా కాదా అన్నది నిర్ధారించిన తర్వాత యాంటీ బయోటిక్స్‌ను సూచించాలని వైద్యులకు ఐఎంఏ హితవు పలికింది.

ధరల మోత

(మొదటిపేజీ తరువాయి)

ఆస్పత్రి ఖర్చులు అధికంగానే ఉన్నాయి. మందులు కొనాలంటేనే గుండె దడదడలాడిపోతోంది. షుగర్, బీపీలకు సంబంధించిన మందుల ధరలు ఇటీవల కాలంలో రెట్టింపయ్యాయి. యాంటి బయాటిక్స్ మందుల ధరలు కూడా అదేవిధంగా ఉన్నాయి. ఇక విద్యుత్ చార్జీలను ఎడాపెడా పెంచేస్తున్నారు. కస్టమర్, ఫిక్సడ్, ఓవర్‌లోడ్, ట్రూ అప్ చార్జీల పేరుతో రెండు నెలలకోసారి ఏదో ఒక రూపంలో భారీగా వసూలు చేస్తున్నారు. దీంతో ప్రైవేటు రంగంలో పనిచేసే ఉద్యోగులే కాదు ప్రభుత్వంలో పనిచేసే చిరుద్యోగుల జీవన ప్రమాణాలు ఇటీవల కాలంలో దారుణంగా తయారయ్యాయి. ప్రతినెలా కుటుంబ పోషణ కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి ఉండటంతో ఇటీవల ప్రభుత్వ రంగంలో పనిచేసే ఉద్యోగులు కూడా ఆత్మహత్యలకు పాల్పడుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. ప్రభుత్వం ధరల నియంత్రణపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

మండలికి సమర్థులను పంపుదాం

- కత్తి నరసింహారెడ్డి, నాగరాజును గెలిపించండి
- ఓబులేసు, జగదీశ్ విజ్ఞప్తి

విశాలాంధ్ర అనంతపురం అర్బన్: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి అధికార దాహం మరింత పెరిగి పోయిందని, ప్రతిపక్ష పార్టీలు, సంస్థల నేతలు ప్రజా ప్రతినిధులుగా ఎన్నిక కాకుండా చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఓబులేసు, డి.జగదీశ్ విమర్శించారు. పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా వచ్చిన ఓబులేసు శనివారం కామ్రేడ్ నీలం రాజశేఖరరెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీశ్, జిల్లా కార్యదర్శి జాఫర్, సత్యసాయి జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్‌తో కలసి మాట్లాడారు. వైసీపీకి 151 మంది ఎమ్మెల్యేలు, 31 మంది ఎంపీలు ఉన్నా జగన్‌కు అధికార దాహం తీరలేదని ఓబులేసు విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల నుండి ఎమ్మెల్సీ ఎన్నికల వరకూ అన్నింటినీ చెరపట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. వైసీపీ తరపున వ్యాపారవేత్త రామచంద్రారెడ్డి ఎమ్మెల్సీ బరిలో ఉన్నారని, పాలకులు వ్యాపారులైతే ప్రజలు భిక్షగాళ్లవుతారని చెప్పారు. అధికారం కట్టబెడితే వారం రోజుల్లో సీపీఎస్‌ను రద్దు చేస్తానని హామీ ఇచ్చిన జగన్...నాలుగేళ్లు గడుస్తున్నా దీనిపై ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ఇలాంటి ప్రభుత్వం బలపరుస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థులను మేధావులు, ఉపాధ్యాయులు, పట్టభద్రులు ఓడించాల న్నారు. సమర్థులను శాసనమండలికి పంపుదామని పిలుపునిచ్చారు. పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డి 34 ఏళ్లుగా ఎస్టీయూ నాయకుడుగా ఉన్నారని, అలాంటి వారు మండలి సభ్యుడుగా ఉంటే సమస్యల పరిష్కారం సాధ్యమౌతుందన్నారు. కత్తి నరసింహారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. దశాబ్ద కాలంగా సామాజిక సేవలో ఉన్న పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజును బలపరచి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రతిపక్షాల పట్ల దేశంలో ప్రధాని మోదీ అనుసరిస్తున్న విధానాలనే జగన్ కొనసాగిస్తున్నారని, రాష్ట్రంలో ప్రతిపక్షాలను అణచివేయడానికి అన్ని ప్రయత్నాలు చేస్తున్నారని ఓబులేసు విమర్శించారు. మోదీ సర్కారుపైనా ఓబులేసు నిప్పులు చెరిగారు. మోదీ వచ్చాక నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటాయని మండిపడ్డారు. తాజాగా వంటగ్యాస్ ధరను మరో రూ.50 పెంచి ప్రజల నడ్డి విరిచారని ఓబులేసు ఆగ్రహం వెలిబుచ్చారు. ధరల పెరుగుదలతో ఓ వైపు ప్రజలు అల్లాడుతుంటే దేశం ప్రగతి వైపు పయనిస్తోందని అబద్ధాలు చెబుతున్నారన్నారు.

పారిశ్రామిక అభివృద్ధి అంటే విశాఖ స్టీల్ సహా కృష్ణపట్నం పోర్టు అమ్మడం, థర్మల్ విద్యుత్ కేంద్రాలు మూసివేయడం కాదని సీఎం జగన్‌కు హితవు పలికారు. విశాఖలో పారిశ్రామికవేత్తల సదస్సు నిర్వహించి లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయని గొప్పలు చెప్పుకుంటున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో రూ.18 లక్షల పెట్టుబడులు వచ్చాయని అనాటి పాలకులు చెప్పారని, అయితే నిరుద్యోగ సమస్య అలాగే ఎందుకుందని నిలదీశారు. పారిశ్రామిక అభివృద్ధి జరగాలంటే ఖనిజ సంపద ఆధారిత భారీ పరిశ్రమలు ఏర్పాటు చేయాలన్నారు. ఉన్న ప్రభుత్వరంగ పరిశ్రమలను నిలబెట్టాలన్నారు. అదానీకి విశాఖ ఉక్కును ధారాదత్తం చేసేందుకు సీఎం జగన్ ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలో ఉన్న మతోన్మాద ప్రభుత్వాన్ని, రాష్ట్రంలో ఉన్న అవకాశవాద నియంతృత్వ ప్రభుత్వానికి చరమగీతం పాడాలన్నారు. నీటి ప్రాజెక్టులకు బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేస్తూ భవిష్యత్ కార్యాచరణ రూపొందించడానికి ఈనెల 5న విజయవాడలో అన్ని రాజకీయ పార్టీల రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. ప్రధాని మోదీ, సీఎం జగన్ ఆగడాలను అడ్డుకునేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు నారాయణస్వామి, మల్లికార్జున, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్‌బాబు, ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు రాజారెడ్డి, శ్రీరాములు, లింగమయ్య, రాజేశ్‌గౌడ్, సంతోశ్ కుమార్ పాల్గొన్నారు.

9,10 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : ఉద్యోగ, ఉపాధ్యాయులపై రాష్ట్ర ప్రభుత్వం కక్షసాధింపు ధోరణితో వ్యవహరించడాన్ని సీపీఐ, సీపీఎం రాష్ట్ర కమిటీలు తీవ్రంగా ఖండించాయి. ఉద్యోగ, ఉపాధ్యాయులపై ప్రభుత్వ వేధింపులు మానుకోవాలని, సకాలంలో జీతాలు చెల్లించాలని, సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు చేస్తున్న ఆందోళనకు మద్దతు ప్రకటించాయి. రాష్ట్ర ప్రభుత్వ చర్యలను నిరసిస్తూ ఉపాధ్యాయ, ఉద్యోగులకు మద్దతుగా మార్చి 9,10 తేదీలలో అన్ని జిల్లా కేంద్రాలలో ధర్నాలు చేయాలని సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు కె.రామకృష్ణ, వి.శ్రీనివాసరావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆ ప్రకటన ఇలావుంది. 2019 ఎన్నికలకు ముందు పాదయాత్ర సందర్భంగా అధికారంలోకి వచ్చిన వారం రోజులలోపు సీపీఎస్‌ను రద్దు చేస్తానని జగన్ హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తరువాత పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీని అమలు చేయకపోగా గత సంవత్సర కాలంగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు జీతాలు సకాలంలో చెల్లించకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఈ నెల ఇప్పటికీ 60 శాతం మంది ఉద్యోగ, ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించలేదు. డీఏలు చెల్లించడం లేదు. డీఏ బకాయిల ఊసెత్తడం లేదు. ఆఖరికి వారి ఖాతాల్లో నిల్వ ఉన్న సొమ్ము నుంచి పెట్టుకునే లోన్లు కూడా సుమారు 3 వేల కోట్ల రూపాయలు గత రెండు సంవత్సరాలుగా చెల్లించకుండా ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తున్నారు. సీపీఎస్ రద్దు కోసం పోరాడుతున్న ఉద్యోగ, ఉపాధ్యాయులపై తీవ్ర నిర్బంధాన్ని, అణచివేతను ఉపయోగిస్తూ అరెస్టులు, షోకాజ్ నోటీసులతో నిరంతరం బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఎమ్మెల్సీ ఎన్నికలలో పాల్గొన్నారని షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నారు. కడప ఆర్‌జేడీ ప్రతాపరెడ్డి సహా కొందరు ఉన్నతాధికారులు ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడుతుంటే కట్టడి చేయలేని ప్రభుత్వం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ఉపాధ్యాయులు పాల్గొనకూడదని ఆదేశించడం గర్హనీయమన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో చర్చలకు పిలిచి మాట్లాడి సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం, భయపెట్టి నిర్బంధాన్ని ప్రయోగించడం సరికాదు. పాఠశాలల పర్యవేక్షణ పేరుతో విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయులను మానసికంగా వేధింపులు గురి చేస్తుంటే విద్యార్థులకు నాణ్యమైన విద్య ఎలా వస్తుందో ప్రభుత్వమే సమాధానం చెప్పాలి. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కక్ష సాధింపు ధోరణిని విడనాడి సీపీఎస్ రద్దుతో సహా ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలన్నింటిని తక్షణం నెరవేర్చాలని కోరారు. ఒకటో తేదీన జీతాలు చెల్లించాలనీ, ఉద్యోగ, ఉపాధ్యాయులను మానసిక వేధింపులకు గురి చేయటాన్ని తక్షణం ఆపాలని రామకృష్ణ, శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.

ఏపీలో 72 ప్రపంచ స్థాయి రైల్వేస్టేషన్లు: కిషన్ రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: సముద్ర ఉత్పత్తులు, రొయ్యలు, ఫార్మా స్యూటికల్స్, ఎలక్ట్రానిక్స్, పెట్రోలియం, ఇంజినీరింగ్ గూడ్స్ మొదలైన రంగాల్లో ఏపీకి గొప్ప వనరులు ఉన్నాయని, రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం నిరంతరం సహకారం అందిస్తోందని కేంద్ర సంస్కృతి, పర్యాటక శాఖ మంత్రి జీ కిషన్‌రెడ్డి తెలిపారు. ఏపీకి రైల్వే బడ్జెట్ కేటాయింపులు 2014లో రూ.886 కోట్లు ఉంటే, ఇప్పుడు రూ.8406 కోట్లకు అంటే తొమ్మిది రెట్లు పెరిగాయన్నారు. ఆంధ్రాలో 72 ప్రపంచ స్థాయి రైల్వే స్టేషన్లను నిర్మిస్తామని, మూడు పారిశ్రామిక కారిడార్లు ఉన్న ఏకైక రాష్ట్రం ఏపీనేనన్నారు. విశాఖపట్నం స్మార్ట్ సిటీకి మొత్తం పెట్టుబడి వ్యయం రూ.3000 కోట్లు అవుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్ నిర్వహించడం అభినందనీయమన్నారు.

ప్రాజెక్టులను గాలికి వదిలేశారు

(మొదటిపేజీ తరువాయి)

ఎన్ఎస్‌పీ ఎడమకాలువ మూడవ జోన్ నుంచి రైతులకు నీటినందిస్తున్న తీరును సీపీఐ బృందం పరిశీలించింది. రామచంద్రపురం రెగ్యులేటర్ వద్ద నీటిని విడుదల చేస్తున్న తీరు గురించి ఎన్ఎస్‌పీ అధికారులను అడిగి తెలుసుకున్నది. అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ ప్రాజెక్టుల సందర్శనలో భాగంగా తాజాగా ఎన్ఎస్‌పీ ఎడమకాలువ నీటి విడుదల తీరు, చింతలపూడి ఎత్తిపోతల నిర్మాణ పనులను పరిశీలించినట్లు చెప్పారు. మూడవజోన్ పరిధిలో మూడు వేల క్యూసెక్కుల సామర్థ్యం ఉన్న కాలువలు ఉండగా, కనీసం 500 క్యూసెక్కుల నీరు కూడా రైతులకు అందటం లేదన్నారు. ఇప్పటికే ఎన్టీఆర్ జిల్లాలోని ఎన్ఎస్‌పీ ఆయకట్టు పరిధిలోని సుమారు రెండు లక్షల ఎకరాల భూములు ఎండు దశకు చేరాయని, సక్రమంగా నీటినందించటంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రాజెక్టు భవనాలు శిథిలావస్థకు చేరి, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయని, వీటిని సక్రమంగా వినియోగించుకునే దిశగా నిధులు అందించకుండా అధికారులను వేధించటం సబబు కాదని సూచించారు. ఎన్టీఆర్, ఏలూరు జిల్లాల రైతుల ప్రయోజనాల దృష్ట్యా కనీసం రోజుకు 1500 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు దేగా ప్రభాకర్, రైతు సంఘం నాయకులు యలమందరావు, పి.జమలయ్య, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి సీహెచ్ కోటేశ్వరరావు, ఏలూరు జిల్లా కార్యదర్శి ఎం.కృష్ణ చైతన్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దోనేపూడి శంకర్, రాష్ట్ర సమితి సభ్యుడు చలసాని వెంకట రామారావు, ఏలూరు జిల్లా నాయకులు కొమ్మన నాగేశ్వరరావు, పెనుమత్స రామకృష్ణంరాజు, రాయంకుల లక్ష్మణరావు, బత్తుల వెంకటేశ్వరరావు, చలసాని నరేంద్ర, పుల్లారావు, ఎన్టీఆర్ జిల్లా నాయకులు నాగుల్ మీరా, ఎం.త్యాగరాజు, చిలుకూరి వెంకటేశ్వరరావు, కృష్ణా మిల్క్ యూనియన్ డైరెక్టర్ బొట్టు రామచంద్రరావు, పగడాల అప్పారావు, చింతలపూడి ఎత్తిపోతల పథకం ఈఈ అప్పారావు, డీఈఈ రవికిరణ్, జిల్లా నాయకులు మేకల డేవిడ్, కొత్తపల్లి సుందర్రావు, ఎం.త్యాగరాజు, గంజాల నాంచారయ్య, అంగోతు నాగు, బాణావతు పెద బాలూనాయక్, బుద్ధి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మరింత ముందుకు

(మొదటిపేజీ తరువాయి)

అందరినీ ఆకట్టుకుందని, ఒక జిల్లా-ఒక ఉత్పత్తి (ఒన్ డిస్ట్రిక్ట్-ఒన్ ప్రొడక్ట్) ఇతివృత్తం ఆధారంగా 137 స్టాళ్లను ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసినట్లు ముఖ్యమంత్రి వివరించారు. ప్రపంచ పెట్టుబడిదారుల సదస్సు సందర్భంగా ఈ రెండు రోజులపాటు కేంద్రం మంత్రులు, విదేశీ ప్రతినిధులు, దౌత్యవేత్తలు, రాయబారులు, దేశీయ, అంతర్జాతీయ పారిశ్రామిక వేత్తలతో ముఖాముఖి చర్చలు జరపడం సంతోషంగా ఉందన్నారు. ఈ సమావేశాలన్నీ అత్యంత ఫలప్రదంగా సాగాయని, పెట్టుబడులకు ఆకర్షణీయ గమ్యస్థానంగా ఆంధ్రప్రదేశ్‌ను నిలిపేందుకు తాము చేస్తున్న ప్రయత్నాలు మంచి ఫలితాలను ఇవ్వడం సంతోషంగా ఉందని తెలిపారు.

352 ఎంఓయూలు... రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులు

రాష్ట్రంతో భాగస్వామ్యానికి సంబంధించి మేము చూపిన దృఢమైన నిబద్ధత, సానుకూల వ్యాపార పరిస్థితుల కారణంగా సదస్సులో రూ.13,05,663 కోట్ల పెట్టుబడికి సంబంధించి 352 అవగాహన ఒప్పందాలు కుదిరాయని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి తెలిపారు. వీటివల్ల 6,03,223 మందికి పైగా యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఒక్క ఎనర్జీ రంగంలోనే రూ.8,84,823 కోట్లకు సంబంధించి 40 అవగాహనా ఒప్పందాలను కుదుర్చుకున్నామని, 1,90,268 మందికి దీనివల్ల ఉద్యోగాలు వస్తాయన్నారు. ఐటీ, ఐటీఈ రంగానికి సంబంధించి రూ.25,587 కోట్లతో 56 ఒప్పందాలను కుదుర్చుకోవడం ద్వారా 1,04,442 మందికి ఉద్యోగాలు వస్తాయని, పర్యాటక రంగంలో రూ.22,096 కోట్లతో 117 ఎంఓయూలు కుదుర్చుకోవడం వల్ల 30,787 మందికి ఉద్యోగాలు వస్తాయని వివరించారు. రెన్యువబుల్ ఎనర్జీలో గణనీయంగా పెట్టుబడులు వచ్చాయని సీఎం చెప్పారు. పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి, పంప్డ్ స్టోరేజీ, గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమోనియా ఉత్పత్తికి సంబంధించి వస్తున్న పెట్టుబడులు పునరుత్పాదక శక్తికి సంబంధించిన క్లిష్టతలను పూర్తిగా తగ్గిస్తాయని, శిలాజ ఇంధన ఆధారిత ఉత్పత్తికి విశ్వసనీయ ప్రత్యామ్నాయాన్ని చూపిస్తాయన్నారు. కర్బన రహిత లక్ష్యంగా, గ్రీన్ ఎనర్జీ దిశగా అడుగులేస్తున్న దేశానికి తన లక్ష్య సాధనలో చక్కటి సహకారాన్ని అందిస్తాయన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మీద, రాష్ట్ర ప్రభుత్వం మీద మీ నమ్మకాన్ని, విశ్వాసాన్ని ఉంచినందుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నానని పెట్టుబడుదారులను ఉద్దేశించి సీఎం అన్నారు. ఎంఓయూలు కుదుర్చుకున్న వారంతా వీలైనంత త్వరగా తమ పెట్టుబడులతో రాష్ట్రంలో కార్యకలాపాలు ప్రారంభించాలని కోరారు. దీనికోసం అన్నిరకాలుగా రాష్ట్ర ప్రభుత్వం తోడుగా ఉంటుందని, మీ వ్యాపారాలు ప్రారంభించడానికి, పరిశ్రమలు పెట్టేందుకు వేగవంతంగా, ఎలాంటి అడ్డంకులు లేకుండా సదుపాయాలను కల్పిస్తుందని తెలిపారు. వీటిని సాకారం చేసేందుకు ఒక మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు, పరిశ్రమల శాఖ స్పెషల్ సీఎస్ ఇందులో సభ్యులుగా ఉంటారని, ఈ కమిటీ ప్రతి వారం సమావేశమై ఒప్పందాల అమలు దిశగా కృషి చేస్తుందని చెప్పారు. మీ రోజువారీ కార్యకలాపాల్లో ఎలాంటి ఇబ్బందులు వచ్చినా వాటిని ఈ కమిటీ పరిష్కరిస్తూ ఈ పెట్టుబడులు ఫలప్రదమయ్యేలా ఆటంకాలు లేకుండా చూస్తుందని సీఎం అన్నారు.

సదస్సు వేదికగా రూ.3841 కోట్ల విలువైన 14 యూనిట్లు ప్రారంభం

సదస్సు వేదికగా శనివారం రూ.3841 కోట్ల విలువైన 14 పారిశ్రామిక యూనిట్లను సీఎం జగన్ వర్చువల్ విధానంలో ప్రారంభించారు. దీనివల్ల 9,108 మందికి ఉద్యోగాలు వస్తున్నాయని, కింబర్లే క్లార్క్, బ్లూస్టార్, క్లైమాటెక్, లారస్ ల్యాబ్, హేవెల్స్ ఇండియా, శారదా మెటల్స్, అల్లాయిస్ తదితర కంపెనీలు ఈ పెట్టుబడులు పెట్టాయని ఆయన చెప్పారు. ఈ కంపెనీలను ప్రారంభించుకోవడం గర్వకారణంగా ఉందన్నారు. రెండో రోజు సదస్సులో కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్ రెడ్డి, కేంద్ర షిప్పింగ్, సహజ వాయువుల శాఖ మంత్రి సర్బానంద్ సోనోవాల్‌తో పాటు అనేక సంస్థల పెట్టుబడిదారులకు ముఖ్యమంత్రి జ్ఞాపికలు అందజేశారు.

యువతకు స్ఫూర్తి గణపతిరాజు ప్రసంగాలు

నేటి నుంచి శతజయంతి ఉత్సవాలు ప్రారంభం

విశాలాంధ్రబ్యూరో-విశాఖపట్నం: కళాప్రపూర్ణ గణపతిరాజు అచ్యుత రామరాజు శతజయంతి ఉత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఏడాది పొడుగునా జరిగే ఈ ఉత్సవాలలో విశాఖసాహితి వంటి సంస్థలు భాగస్వామ్యమవుతాయి. దాదాపు ఐదు దశాబ్దాల పాటు విశాఖనగరంలో జరిగిన సాహితీ, సాంస్కృతిక కార్యక్రమాలకు అచ్యుతరామరాజు మార్గదర్శిగా నిలిచారు. కథా, నాటక రచయితగా, నటునిగా, విశ్లేషించి, ఆంగ్ల చారిత్రక నాటకాలలో ప్రముఖ పాత్రలు ధరించి మెప్పించిన నటునిగా, విశాఖ సాంస్కృతిక రంగచరిత్రలో వారిదొక ప్రత్యేక అధ్యాయం. ఆ రోజులలో అనేకమంది యువకులు స్థాపించిన నాటక, సాహితీ సంస్థలకు ఆయన సూచనలు, సలహాలు అనివార్యం. నగరంలో ప్రముఖ న్యాయవాదిగా పేరు ప్రతిష్ఠలు పొందారు. ఆరేళ్లపాటు సమగ్ర ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సభ్యునిగా, ఆంధ్రప్రదేశ్ సంగీత, నాటక అకాడమీ సభ్యునిగా వ్యవహరించారు. తొలితరం నటుల కంఠస్వరంతో, తక్కువ శక్తివంతమైన మైకులోనయినా వారు ప్రసంగాలు వింటుంటే ఉత్తేజం కలిగేది. రెండు మూడు తరాల వారికి సానుకూల దృక్పథంతో, స్ఫూర్తిమంతమైన సందేశా లిచ్చి, వారిని కళారంగంలో ప్రతిభావంతులుగా తీర్చిదిద్దిన కళాతపస్వి. పీవీ నరసింహరావు, తెన్నేటి విశ్వనాథం, డా॥బెజవాడ గోపాలరెడ్డి, దామోదరం సంజీవయ్య వంటి రాజకీయ సాహితీవేత్తలతోనూ, మారేపల్లి రామచంద్రశాస్త్రి కవి, రవిశాస్త్రి, పురిపండా అప్పలస్వామి, ఆరుద్ర తదితర సుప్రసిద్ధ సాహితీవేత్తలతోను ఆయనకు సన్నిహిత సంబంధాలుండేవి. డా॥ కేవీ గోపాలస్వామి, కె.వెంకటేశ్వరరావు, కొత్తూర్తి భాస్కరరావు, రుద్రరాజ్ కుమార్ రాజా, అబ్బూరి గోపాలకృష్ణ, చాట్ల శ్రీరాములు వంటి రంగస్థల దిగ్గజాలతో ఆయన ఆత్మీయబంధం వెలకట్టలేనిది. 2024 మార్చి 5వ తేదీ శతజయంతి వరకు ప్రతినెల సంస్మరణ సభలు, సాహితీ, నాటక ప్రముఖులకు గణపతిరాజు పేరిట పురస్కారాలు అందజేయనున్నామని గణపతిరాజు అచ్యుతరామరాజు స్మారకట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షులు పెన్మత్స లలితా వాశిష్ఠ తెలిపారు.

విజయనగరంలో మలబార్ గోల్డ్ ప్రారంభం

విశాలాంధ్ర విజయనగరం: విజయనగరం రైల్వే స్టేషన్‌రోడ్‌లో మలబార్ గోల్డ్ షోరూంను సినీనటి తమన్నా, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, విజయనగరం ఎంపి బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్ బాబు శనివారం ప్రారంభించారు. తమన్నా రాక కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూశారు. ఆమె రాకతో అభిమానుల్లో సందడి నెలకొంది. అభిమానులకు అభివాదం చేస్తూ ఆమె ముందుకు సాగి షోరూంను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మలబార్ నగల షోరూం ప్రత్యేకతను తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ ఎం సురేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

పెట్టుబడుల సదస్సులో 352 ఒప్పందాలు

- రాష్ట్ర పారిశ్రామిక ప్రగతిపై దేశ, విదేశాల నుంచి మద్దతు
- పారిశ్రామిక దిగ్గజాలు ముగ్ధులయ్యారు
- పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: విశాఖ వేదికగా రెండు రోజులపాటు జరిగిన ప్రపంచ పెట్టుబడిదారుల సదస్సు (గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్)లో 352 ఒప్పందాలు చేసుకున్నట్లు ఏపీ పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ తెలిపారు. సదస్సు ముగిసిన అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి రూ.13.6 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయన్నారు. తొలుత రూ.5 లక్షల కోట్లు వస్తాయని భావిస్తే అంతకుమించి రూ.13.6 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. పరిశ్రమల వల్ల 6 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయని, సదస్సు వల్ల ఏపీ సహజ వనరులు ప్రపంచానికి తెలిశాయన్నారు. సదస్సులో వంద దేశాల ప్రతినిధులు, ఏడు దేశాల రాయబారులు పాల్గొన్నారన్నారు. కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరి, సర్బానంద సోనోవాల్, కిషన్ రెడ్డి, దేశ విదేశాల నుంచి ప్రముఖ పారిశ్రామికవేత్తలు, ప్రతినిధులు పెద్ద ఎత్తున హాజరై సదస్సును విజయవంతం చేశారని చెప్పారు. సదస్సులో మాట్లాడిన పారిశ్రామికవేత్తలు రాష్ట్రంలోని పారిశ్రామిక విధానం, ప్రభుత్వం పరిశ్రమలకు ఇస్తున్న సహకారాన్ని గురించి ఎంత బాగా వివరించారో తెలుగు ప్రజలంతా చూశారని అన్నారు. అంబానీ, అదానీ, మిట్టల్, జిందాల్ వంటి పారిశ్రామిక దిగ్గజాలు రాష్ట్రంలో వారు పెట్టనున్న పెట్టుబడుల గురించి సదస్సులోనే ప్రకటించటం రాష్ట్ర అభివృద్ధికి, పారిశ్రామిక ప్రగతికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి తీసుకుంటున్న చర్యలను ఉత్తేజపరిచిందని మంత్రి తెలిపారు. సీఎం జగన్ గడిచిన మూడున్నర సంవత్సరాలలో పారిశ్రామిక రంగంలో చేపట్టిన సంస్కరణలు, పారిశ్రామికవేత్తలకు ఇచ్చిన భరోసా ఈ సదస్సు వేదిక పై నుంచే పారిశ్రామికవేత్తలు వివరించటం తమకెంతో ఆనందంగా ఉందని అన్నారు. జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంపై తమకు నమ్మకం ఉందని పారిశ్రామికవేత్తలు స్వయంగా చెప్పడం పారిశ్రామిక ప్రగతికి శుభసూచకమని మంత్రి అమర్‌నాథ్ వివరించారు. వచ్చిన పెట్టుబడులపై పెద్ద ఎత్తున ప్రచారం చేసుకునే కంటే మన పరిపాలన, పారిశ్రామిక సంస్కరణలు, పరిశ్రమలకు మనం అందిస్తున్న సహకారం గురించి మాత్రమే ప్రజలకు తెలియపరచాలని సీఎం పదేపదే చెప్పారని మంత్రి అమర్‌నాథ్ తెలిపారు. ఈ సదస్సులో 48 దేశాలకు చెందిన సుమారు వందమంది వివిధ అంశాలపై చర్చించారన్నారు. మరో 40 దేశాలకు చెందిన 600 మంది ప్రతినిధులు వర్చువల్‌గా సదస్సులో పాల్గొన్నారని వివరించారు. ప్రస్తుతం జరిగిన ఒప్పందాలు 90 శాతం వరకు గ్రౌండ్ అయ్యేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో పరిశ్రమల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, పరిశ్రమల శాఖ డైరెక్టర్ తదితరులతో ఒక కమిటీ వేశారని, వారానికి ఒకసారి ఈ కమిటీ సమావేశమై ఎంఓయూలు ఏ మేరకు అమలు జరుగుతున్నాయో పర్యవేక్షించాలని చెప్పినట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రంలో ఉన్న ల్యాండ్ బ్యాంకును పరిశ్రమలకు సిద్ధంగా ఉంచామని, ఇంకా వారికి కావలసిన సౌకర్యాలు కల్పించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే ప్రకటించనున్న నూతన పారిశ్రామిక విధానం కూడా పారిశ్రామికవేత్తలకు మరింత సౌకర్యవంతంగా ఉండవచ్చని ఆయన చెప్పారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి కరికల్ వలవన్, కమిషనర్ జి.సృజన, సమాచార శాఖ కమిషనర్ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీలో వనరులు పుష్కలం

ఏపీ సీఎం జగన్ విజన్ గల నాయకుడు. రాష్ట్రంలో మంచి వనరులు ఉన్నాయి. ప్రతిభగల అధికారులు ఉన్నారు. రెండు రోజుల గ్లోబల్ ఇన్వెస్టర్ సదస్సు జోష్‌గా సాగింది. ఒక ఫోన్ కాల్ చేస్తే చాలు సమస్యలు పరిష్కరిస్తామని సాక్షాత్తూ సీఎం చెప్పడం ఆనందం.

– గజానన్ నాబర్, సీఈవో అండ్ ఎండీ, నోవా ఎయిర్

గ్రీన్ ఎనర్జీ అప్రోచ్ సూపర్

దేశంలో ఏపీ రోల్ మోడల్‌గా నిలిచింది. పునరుత్పాదక ఇంధన రంగంలో కీలక పాత్ర పోషించబోతుంది. ఏపీ గ్రీన్ ఎనర్జీ అప్రోచ్ సూపర్. కార్బన్ రహిత పర్యావరణం కోసం ఏపీ కృషి చేస్తోంది. పులివెందులలో ఓ ప్రాజెక్టును నిర్మిస్తున్నాం. సోలార్ మైక్రో విద్యుత్‌కు చాలా అవకాశాలున్నాయి. ఇంటిగ్రేటెడ్ ఎనర్జీ ప్రాజెక్టును నిర్వహిస్తున్నాం.

– వినిత్ మిట్టల్, చైర్మన్, అవడా గ్రూప్

ఏపీలో బలపడుతున్న కంపెనీలు

ఏపీ కొన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతూ దేశంలోనే ముందుంది. ఎకో సిస్టం బాగుండటం వల్ల కంపెనీలు బలపడుతున్నాయి. ఫార్మా రంగంలో ఆంధ్ర అభివృద్ధి చెప్పలేనిది. ప్రసిద్ధి చెందిన ఫార్మ కంపెనీలైన అరబిందో, దివిస్, నక్కపల్లి హెట్రో డ్రగ్స్ వంటివి ఉన్నాయి. ప్రపంచానికి కావాల్సిన డ్రగ్స్ ఏపీలో తయారవుతున్నాయి. 2007లో ప్రారంభించిన మేము ఈరోజు 8 వేల మంది ఉద్యోగులకు ఉపాధి కల్పిస్తున్నాం. ఫార్మాస్యూటికల్స్ రంగాల్లో ఏపీ మంచి వృద్ధి సాధిస్తోంది.

– సత్యనారాయణ చావా, ఫౌండర్ అండ్ సీఈవో, లారస్ ల్యాబ్స్

10వేల మందికి ఉపాధి

ఫార్మాస్యూటికల్స్ రంగంలో ఏపీ దేశంలోనే ముందుంది. అందుకు కారణం ఏపీలో ఉన్న ఎకో సిస్టమే కారణం. నక్కపల్లి హెటిరో గ్రూప్ నుంచి 10 వేలమందికి ఉపాధి లభిస్తుంది.

– బండి వంశీకృష్ణ, ఎండీ, హెటిరో గ్రూప్ ఆఫ్ కంపెనీస్

రెన్యువబుల్ ఎనర్జీ రంగం కీలకం

రెన్యువబుల్ ఎనర్జీ రంగంలో మంచి అవకాశాలున్నాయి. ఏపీలో వనరులు ఉండడంతో ఇక్కడ పెట్టుబడులు పెట్టడానికి సిద్ధంగా ఉన్నాం. ఆంధ్ర ప్రజలు చాలా శక్తిమంతులు, నైపుణ్యం గలవారు. అన్ని రంగాల్లో వారు రాణిస్తున్నారు. మహిళలు, ఇంజినీరింగ్ రంగాల్లో దేశంలోనే కాదు, విదేశాల్లోను ఆంధ్రవారు అగ్రగామిగా నిలుస్తున్నారు.

-సంతానం, సీఈఓ, సెయింట్ గోబెయిన్

ఫార్మాలో మంచి అవకాశాలు

అంతర్జాతీయంగా ఫార్మా ఇండస్ట్రీ కీలకం. కోవిడ్ తర్వాత ఈ రంగానికి చాలా ప్రాధాన్యత పెరిగింది. రష్యా- ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో కూడా అనేక పరిశ్రమలు ఆంధ్రకు వస్తున్నాయి. 25 ఏళ్లుగా సేవలందిస్తున్నాం. హైదరాబాదులో ప్రారంభించిన రెడ్డీస్ లాబ్ ఐదు ఎకరాల భూమిలో ఐదు మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్లు ద్వారా కార్యకలాపాలు నిర్వహిస్తున్నాం. మెడిటెక్ జోన్స్ ద్వారా ఏపీలో కార్యకలాపాలు మరింత పెరగాయి.

సతీశ్ రెడ్డి, డైరెక్టర్ రెడ్డీస్ ల్యాబ్

ఏపీవైపు... అంతర్జాతీయ కంపెనీల చూపు

తక్కువ కాలంలోనే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అభివృద్ధి దిశగా ముందుకెళ్తోంది. కీలక రంగాల్లో ఏపీ పటిష్ఠంగా ఉంది. అన్ని రంగాల్లో మహిళల పాత్ర గణనీయంగా పెరిగింది. ఏపీ పారిశ్రామిక ప్రగతికి సీఐఐ సహకారం సంపూర్ణంగా ఉంటుంది. అంతర్జాతీయ కంపెనీలు ఏపీ వైపు చూస్తున్నాయి. సమ్మిళిత కృషి కోసం ఏపీ సీఎం జగన్ కృషి చేస్తున్నారు.

సుచిత్ర ఎల్ల, ఎండీ, భారత్ బయోటెక్

ఏపీ ప్రగతిలో భాగమైనందుకు సంతోషం

పారిశ్రామిక ప్రగతి కోసం వైఎస్ఆర్ చేసిన కృషి అభినందనీయం. మూడు దేశాల్లో అపాచీ గ్రూప్ కార్యకలాపాలు ఉన్నాయి. ఏపీలో సంస్థ కార్యకలాపాలు నిర్వహించడం ఆనందంగా ఉంది. ఏపీ ప్రగతిలో భాగమైనందుకు సంతోషపడుతున్నాం.

సెర్జియా లీ, డైరెక్టర్, అపాచీ అండ్ హిల్‌టాప్ గ్రూప్

న్యాయ వ్యవస్థ ఔన్నత్యానికి కృషి చేయాలి

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.వి.శేషసాయి

విశాలాంధ్ర-భీమవరం: న్యాయ వ్యవస్థ ఔన్నత్యానికి ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ విశేష కృషి సల్పాలని, ప్రజలకు న్యాయం జరిగేలా చూడాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏవీ శేషసాయి పిలుపునిచ్చారు. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా 5వ మహాసభలు స్థానిక డీఎన్నార్ న్యాయ కళాశాలలో శనివారం ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా వచ్చిన జస్టిస్ శేషసాయి మాట్లాడుతూ ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ లో కీలకంగా వ్యవహరించిన వీఆర్ కృష్ణయ్య, పద్మనాభరెడ్డి వంటి మహనీయుల స్ఫూర్తితో న్యాయ వ్యవస్థ బలోపేతానికి కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. వ్యక్తుల ప్రాథమిక హక్కులకు భంగం కలిగినప్పుడు బాధితులకు అండగా నిలవాలని ఇదే సందర్భంలో సీనియర్ న్యాయవాదులను, క్లయింట్లను గౌరవించాలని, సన్నద్ధమవకుండా, కేసు చదవకుండా కోర్టుకు వెళ్లొద్దని ఆయన యువ న్యాయవాదులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన ఫ్రీ లీగల్ ఎయిడ్, లీగల్ సర్వీసెస్ అథారిటీ, ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు, సీఆర్‌పీసీ, సీపీసీలపై వివరించి అనేక తీర్పులను ఉదహరించారు. మరో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్కే కృపాసాగర్ మాట్లాడుతూ ఐఏఎల్ సభ్యులు ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ న్యాయ వ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. గౌరవ అతిథిగా వచ్చిన ఐఏఎల్ జాతీయ కార్యదర్శి చలసాని అజయ్ మాట్లాడుతూ ప్రాథమిక హక్కులు, మానవ హక్కులు, రాజ్యాంగం పరిరక్షణకు న్యాయవాద వృత్తిని బలోపేతం చేయడానికి స్థాపించిన ఐఏఎల్ నాటి నుంచి నేటి వరకు వ్యవస్థ బలోపేతానికి కృషి చేసిందన్నారు. మరో అతిథి, ఐఏఎల్ రాష్ట్ర అధ్యక్షుడు ముప్పాళ్ల సుబ్బారావు మాట్లాడుతూ 20మంది సభ్యులతో ప్రారంభమైన ఐఏఎల్ వీఆర్ కృష్ణయ్య, పీఎన్ భగవతి, వెంకటాచలయ్య వంటి మహానుభావుల సారధ్యంలో నేడు జాతీయ స్థాయిలో కీలకంగా మారిందని హర్షధ్వానాల మధ్య తెలిపారు. డీఎన్నార్ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రఘురామ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఐఏఎల్ రాష్ట్ర కార్యదర్శి కె.చంద్రశేఖరరెడ్డి, భీమవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలేటి న్యూటన్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో భాగంగా హైకోర్టు న్యాయమూర్తులను, ఐఏఎల్ నాయకులను ఘనంగా సత్కరించారు. జిల్లా జడ్జి సత్యాదేవి, సీనియర్ సివిల్ జడ్జి అప్పలస్వామి, జ్యుడీషియల్ మేజిస్ట్రేట్లు పవన్ కుమార్, ధనరాజ్, ఐఏఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెల్లబోయిన రంగారావు, ఐఏఎల్ రాష్ట్ర నాయకులు కోనాల భీమారావు, బండి వెంకటేశ్వరరావు, నెక్కంటి క్రాంతి కుమార్, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయవాదులు, డీఎన్నార్ న్యాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

19న ప్రపంచ కవితా దినోత్సవ సభ

విశాలాంధ్ర-హైదరాబాద్: ప్రపంచ కవితా దినోత్సవాన్ని పురస్కరించుకొని కవి సంధ్య సాహిత్య, సాంస్కృతిక సంస్థ అధ్వర్యాన ఈ నెల19వ తేదీ సాయంత్రం 5గంటలకు తెలుగు విశ్వ విద్యాలయం కమిటీ హాలులో ప్రపంచకవితా దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. శిఖామణి అధ్యక్షత న జరిగే ఈ సభలో దర్భశయనం శ్రీనివాసచార్య కవిత్వం ప్రాసంగికత అంశం పై ప్రత్యేక ప్రసంగం చేస్తారు. కవి సంగమం అధ్యక్షులు యాకూబ్‌కు ఆత్మీయ కవి సత్కారం ఉంటుంది. సుధామ, కొప్పర్తి అధ్యక్షతన కవిసమ్మేళనం జరుగుతుంది. కె. శివారెడ్డి, వాడ్రేవు చిన వీరభద్రుడు, నందిని సిధారెడ్డి, తుల్లిమిల్లి విల్సన్ సుధాకర్, ఏనుగు నరసింహారెడ్డి అతిథులుగా పాల్గొంటారు. చీకోలు సుందరయ్య, సీఎస్ రాంబాబు సమన్వయకర్తలుగా వ్యవహరిస్తారు.

విట్‌లో క్రీడా సాంస్కృతిక ఉత్సవాలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: వీఐటీ-ఏపీ విశ్వవిద్యాలయంలో విటోపియా-2023 వార్షిక క్రీడల, సాంస్కృతిక సంబరాలు శనివారం ప్రారంభమయ్యాయి. 'వసుధైకం' అనే వివిధ రాష్ట్రాల సంస్కృతిని ప్రతిబింబించే సాంప్రదాయ ర్యాలీతో ఉదయం ఉత్సవాలు ఆరంభమయ్యాయి. తదుపరి అంతర్జాతీయ పారా ఒలింపిక్స్‌కు వాలీబాల్ జట్టు పోటీని నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఒక జట్టుగా ప్రపంచ పారా వాలీబాల్‌లో భారత్ తరపున ఆడనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పారా ఒలింపిక్స్ ఇండియా వాలీ బాల్ ఫెడరేషన్ అధ్యక్షులు హెచ్. చంద్రశేఖర్ హాజరయ్యారు. అర్జున అవార్డు గ్రహీత హెచ్.ఎన్.గిరీష, ధ్యాన్ చాంద్ అవార్డు గ్రహీత సుక్బీర్ సింగ్ గౌరవ అతిథులుగా పాల్గొన్నారు. స్టాండ్ అప్ కమెడియన్లు రాజశేఖర్ మామిడన్నా, ఆకాశ్ గుప్త అందరినీ నవ్వించారు. జాతీయస్థాయి అవార్డు గ్రహీత కూచిపూడి కళాకారిణి, నటి సంధ్య రాజు, సంగీత దర్శకుడు సునీల్ కశ్యప్ చేతుల మీదుగా విజేతలు బహుమతులు అందుకున్నారు. కిన్నెరా మొగలయ్య గానం అలరించింది. ఇండియన్ ఐడల్ అభ్యర్థి షణ్ముఖ ప్రియ గానం ఆకట్టుకుంది. కార్యక్రమంలో విట్ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ డా.కోటారెడ్డి , రిజిస్ట్రార్ డాక్టర్ జగదీశ్ చంద్ర ముదిగంటి, విటోపియా కన్వీనర్ డాక్టర్ సుధాకర్ ఇలంగో, స్టూడెంట్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ డా.అనుపమ పాల్గొన్నారు.

కత్తి నరసింహారెడ్డిని గెలిపించండి

రావులపల్లి రవీంద్రనాథ్ పిలుపు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో పీడీఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ పిలుపునిచ్చారు. అలాగే రాయలసీమ పశ్చిమ జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ నుంచి పోటీ చేస్తున్న కత్తి నరసింహారెడ్డి విజయానికి కృషి చేయాలని ఏఐటీయూసీ శ్రేణులకు ఆయన శనివారం ఒక ప్రకటనలో సూచించారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక వర్గ సమస్యలను శాసనమండలిలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే, బయట జరిగే పోరాటాలకు మద్దతిచ్చే వారిని గెలిపించుకోవాలన్నారు. రాజకీయాలకు అతీతంగా జరుగుతున్న ఎన్నికలను బీజేపీ, వైసీపీ, టీడీపీ రాజకీయం చేస్తున్నాయని విమర్శించారు. ధన రాజకీయాలను ఆమోదించొద్దని, డబ్బుతో గెలిస్తే శాసనమండలిలో ఏం మాట్లాడతారు? మన సమస్యలపై ఎలా పోరాడతారు? అని ప్రశ్నించారు. శాసనసభలో కూడా ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మికుల సమస్యలపై గొంతెత్తే వారు కరువయ్యారన్నారు. ఓటు ఆయుధమని, దానిని నిజాయితీగా విని యోగించుకోవాలని, ప్రలోభాలకు లొంగకూడదని రవీంద్రనాథ్ హితవు పలికారు.

గ్యాస్ ధరలపై విజయనగరంలో నిరసన

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: పెరిగిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని మధ్యాహ్న భోజన పథకం కార్మికసంఘం (ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షులు కె.స్రవంతి డిమాండ్ చేశారు గ్యాస్ ధర పెంపునకు నిరసనగా విజయ నగరంలోని పూల్ బాగ్ కాలనీ ప్రభుత్వ పాఠశాల వద్ద శనివారం గ్యాస్ బండలతో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా స్రవంతి మాట్లాడుతూ ఇప్పటికే అనేక ఇబ్బందులు పడుతూ ప్రభుత్వం నూతన మెనూ పెట్టినప్పటికీ దానికి అనుగుణంగా పనిచేస్తున్న వంట కార్మికులపై ఒక్కసారిగా గ్యాస్ ధర పెరగడం వల్ల వారంతా అనేక ఇబ్బందులకు గురి అవుతున్నారు అన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన పథక కార్మికులకు మెస్ చార్జీలను వెంటనే పెంచాలన్నారు. అధికారులు గ్యాస్ ధరలను దృష్టిలో ఉంచుకొని కార్మికులకు అండగా ఉండాలన్నారు. గ్యాస్ పేరు చెప్పి ఏజెన్సీలు రద్దు చేస్తామని చెప్పడం సమంజసం కాదన్నారు. పెరిగిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని, ప్రభుత్వమే సబ్సిడీ కింద గ్యాస్‌ను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో కార్మికులు చిన్నారి, కుసుమ, వందన తదితరులు పాల్గొన్నారు.

16న 'చలో విజయవాడ'

- ఆశా వర్కర్లకు రూ.21వేల జీతం, ప్రభుత్వోద్యోగులుగా గుర్తింపు
- ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ: ఆశా వర్కర్లకు రూ.21వేల కనీస వేతనం, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు డిమాండ్‌తో ఈనెల 16న చలో విజయవాడకు ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎస్ వెంకటసుబ్బయ్య పిలుపునిచ్చారు. ఆశా కార్మికులకు పని భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. విజయవాడ గొల్లపూడిలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం ఆశా కార్మికుల సమావేశం అధ్యక్షురాలు పి.సుభాషిని అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన సుబ్బయ్య మాట్లాడుతూ 60 సంవత్సరాలు పైబడిన వారిని పని నుంచి తీసివేస్తామని బెదిరించడం సరైనది కాదన్నారు. ఆశా వర్కర్లు స్వచ్ఛంద ఆరోగ్య కార్యకర్తలు తమ ఒంట్లో శక్తి ఉన్నంత వరకు పని చేయడానికి నాడు అంగీకరించారని గుర్తుచేశారు. టెన్త్ విద్యార్హత ఉండాలనడం సమంజసం కాదన్నారు. దాదాపు 16 ఏళ్లు ఇదే వృత్తిలో ఉన్న పేద మహిళలకు ఆంక్షలు పెట్టడం తగదన్నారు. ముఖ హాజరుపెట్టి రోజూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు రావాలన్న నిబంధన సరైనది కాదన్నారు. ఆశా కార్మికులకు కనీస వేతనం, యూనిఫారం, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏఎన్ఎం పూర్తిచేసిన ఆశా కార్యకర్తలకు పదోన్నతలు కల్పించాలని, ఏఎన్ఎం రాత పరీక్షలు రాసిన వర్కర్లకు వెయిటేజ్ మార్కులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్స్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్.శాంతి మాట్లాడుతూ ఆశా కార్మికుల సమస్యలపైన మార్చి 20 నుంచి ఏప్రిల్ 20 వరకు 26 జిల్లాలలో సమావేశాలు నిర్వహిస్తామన్నారు. వారి సమస్యలపై ప్రభుత్వం సరిగా స్పందించకపోతే రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఆశా వర్కర్స్ యూనియన్ కడప జిల్లా గౌరవ అధ్యక్షులు గుంటి వేణుగోపాల్ మాట్లాడుతూ అన్ని రకాల వ్యాధులకు, పేదలకు వైద్య సేవలు అందిస్తున్న వారికి తగిన గుర్తింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కల్లేపల్లె శైలజ, అయ్యవారు అమ్మ తదితరులు పాల్గొన్నారు.

పీడీఎఫ్ అభ్యర్థులను గెలిపించాలి

డీహెచ్‌పీఎస్, కేవీపీఎస్ పిలుపు

విశాలాంధ్ర-ఒంగోలు: పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించుకుందామని డీహెచ్‌పీఎస్, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు కరవది సుబ్బారావు, ఆంధ్ర మాల్యాద్రి పిలుపునిచ్చారు. ఒంగోలులోని ఎల్‌బీజీ భవన్‌లో శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ శాసనమండలి ఎన్నికలు జరుగుతున్న ప్రతిసారి ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పేదలు, దళితుల పక్షపాతిగా వ్యవహరించే వారినీ, ప్రజా సమస్యలపై అవగాహన ఉన్నవారిని డీహెచ్‌పీఎస్, కేవీపీఎస్ బలపరిచి గెలిపించేందుకు కృషి చేస్తున్నాయనితెలిపారు. ప్రజా సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని తెలిపారు. రాష్ట్రంలో ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం పొడిగించేందుకు ఆర్డినెన్స్ తీసుకురావడానికి పీడీఎఫ్ ఎమ్మెల్సీల కృషి మరువలేనిది తెలిపారు. మన రాష్ట్రంలో మార్చి 13న జరుగుతున్న శాసనమండలి ఎన్నికల్లో తూర్పు, పశ్చిమ రాయలసీమ, ఉత్తరాంధ్ర శాసనమండలి ఎన్నికల్లో పోటీ చేస్తున్న పిడిఎఫ్ అభ్యర్థులను కోరెడ్ల రమాప్రభ , పొక్కి రెడ్డి బాబురెడ్డి, మీగడ వెంకటేశ్వరరెడ్డి, కత్తి నర్సింహారెడ్డి, పోతుల నాగరాజును గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వీరికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయమని కోరారు. జిల్లాలో జిల్లా పరిషత్ సమావేశాల్లోనూ, విజిలెన్స్ కమిటీ సమావేశాల్లోనూ దళితుల సమస్యలపై తమ వాణి వినిపించారని తెలిపారు. కరోనా సమయంలో సహాయ కార్యక్రమాల్లో పాల్గొంటూ సహకారాలు అందించారని తెలిపారు. విలేకరుల సమావేశంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ఏ శ్రీనివాసులు పాల్గొన్నారు.

రామలక్ష్మి మృతిపై సీపీఎం సంతాపం

విశాలాంధ్ర-విజయవాడ: ప్రముఖ రచయిత్రి కూచి రామలక్ష్మి మృతి తెలుగు సాహిత్యానికి తీరని లోటని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆమె కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అభ్యుదయ రచయిత ఆరుద్ర సతీమణి రామలక్ష్మి ఎన్నో కథలు, నవలలు, విమర్శనా వ్యాసాలు రాశారని వెల్లడించారు. తెలుగు సినిమాలకు కథ, మాటలూ అందించారని, తన రచనలలో అంతర్లీనంగా స్త్రీవాదాన్ని వ్యక్తపరిచేవారని శ్రీనివాసరావు పేర్కొన్నారు.

ఇళ్లకూల్చివేతకు సీపీఐ నిరసన

బొబ్బిలి మున్సిపల్ ఆఫీసు ముందు ధర్నా

విశాలాంధ్ర-బొబ్బిలి: విజయనగరం జిల్లా బొబ్బిలిలో ఇందిరమ్మ కాలనీలో కరెంట్ వైర్ల కింద పాకలు వేసుకొని నివాసం ఉంటున్న నిరుపేదల ఇళ్లను మున్సిపల్ అధికారులు జేసీబీతో కూల్చేయడాన్ని నిరసిస్తూ ఇళ్లు కోల్పోయిన బాధితులను అన్ని విధాల ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ సీపీఐ అధ్వర్యాన శనివారం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాధితులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ మాట్లాడుతూ, అమ్మి గారి కోనేరు గట్టు, ఇందిరమ్మ కాలనీ. గెస్ట్‌హౌస్ కాలనీల్లో కొందరు అధికార పార్టీ నాయకుల అండదండలతో అనాధికా రికంగా ఇల్లు నిర్మాణాలు చేపడుతున్నారని అటువంటి వారిపై మున్సిపల్ శాఖ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకుండా కడు పేదరికంతో జీవనం గడుపుతున్న పేదలపై ప్రతాపం చూపడం సిగ్గు మాలిన చర్యగా పేర్కొన్నారు. ఇళ్లు కోల్పోయిన వారికి న్యాయం జరిగే వరకు సీపీఐ అండగా ఉంటుందని చెప్పారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న మాట్లాడుతూ మున్సిపల్ అధికారులకు చిత్తశుద్ధి ఉంటే ఇందిరమ్మ కాలనీలో కొంతమంది భూకబ్జాదారులు లక్షలాది రూపాయలు విలువచేసే ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి పునాదులు వేసి లక్షలాది రూపాయలకు అమ్ముకున్న వారిపై చర్యలు తీసుకొని. అలాంటి వాటిని జేసీబీలతో కూల్చివేయాలని డిమాండ్ చేశారు.

సంపాదకీయం

ఆదిలోనే హంసపాదు

రాజ్యాంగం, ప్రజాస్వామ్యం పరిరక్షణ, ఆర్థికవ్యవస్థ సముద్ధరణ కోసం ప్రతిపక్షాలన్నీ ఐక్యమై 2024లో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలన్న లక్ష్యానికి ఆదిలోనే హంసపాదు పడింది. పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ లోక్‌సభ ఎన్నికల్లో తాను ఒంటరిగా పోటీ చేస్తానని ప్రతిపక్ష ఐక్యతకు గండి కొట్టారు. ప్రతిపక్షాలన్నీ ఏకమై మోదీ ప్రభుత్వాన్ని ఓడించాలన్న ప్రతిపాదనను మొదట మమత ప్రతిపాదించారు. ఈ దిశలో ప్రయత్నం కూడా చేశారు. ఢిల్లీకి వెళ్లి కాంగ్రెస్ నాయకులతోనూ మంతనాలు జరిపారు. తర్వాత మౌనం దాల్చారు. రాష్ట్రంలోని 42 సీట్లనూ తాను గెలుచుకొని ప్రధానమంత్రి పదవినీ ఆశించారు. ఒంటరి పోటీ ప్రకటనకు తక్షణ ప్రేరణ బెంగాల్‌లో ఇటీవల సార్దిఘీ అసెంబ్లీ స్థానానికి జరిగిన ఉప ఎన్నికల్లో వామపక్ష కాంగ్రెస్ కూటమి అభ్యర్థి తృణమూల్ అభ్యర్థిపై గెలుపొందారు. అత్యధిక ముస్లింలు కాంగ్రెస్ వైపు మళ్లుతున్నారన్న సంకేతం ఈ ఎన్నికల ఫలితం అందించింది. ఈ తాజా పరిణామం మమతను తీవ్ర ఆందోళనకు గురిచేసిఉంటుంది. దుందుడుకు నిర్ణయాలు తీసుకోవడం ఆమెకున్న అలవాటే. ప్రతిపక్షం ఐక్యమై బీజేపీని ఓడించకపోతే ప్రజలకు, దేశానికి, కలగనున్న ప్రమాదాన్ని ఒక్క క్షణం కూడా ఆలోచించకుండానే ప్రకటన చేశారని దుందుడుకు స్వభావాన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు. అమె మేనల్లుడు అభిషేక్ బెనర్జీపై వచ్చిన అవినీతి ఆరోపణలు రుజువై జైలు శిక్షపడితే రానున్న ఎన్నికల్లో తృణమూల్‌కు కోలుకోలేని ఎదురుదెబ్బ తగిలినా తగలవచ్చు. దీని నుంచి తప్పించుకునేందుకు కూడా ఈ నిర్ణయం తీసుకొని ఉండవచ్చు. ఏది ఏమైనా మమత తీసుకున్న దేశ ప్రజలు కోరుకుంటున్న ప్రత్యామ్నాయ ప్రభుత్వ లక్ష్యంపై సమ్మెట దెబ్బ వేశారు. ఈశాన్య రాష్ట్రాలు త్రిపుర, నాగాలాండ్, మేఘాలయ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లోనూ పోటీచేసి ఎంత మాత్రం ప్రభావం చూపలేకపోయారు. ఈ రాష్ట్రాల్లో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. సార్దిఘీలో గెలుపు నల్లేరు మీద నడక అనుకున్న మమతకు కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు విభ్రాంతి కల్పించింది. ప్రతిపక్ష ఐక్య కూటమి ఏర్పడినప్పుడు కొన్ని రాష్ట్రాల్లో సీట్ల సర్దుబాటు పెద్ద క్లిష్ట సమస్యగా మారవచ్చు. బీజేపీ ఓటమి ప్రధాన లక్ష్యమైనప్పుడు గరిష్ఠంగా సర్దుబాట్లు, త్యాగాలు తప్పనిసరి అవుతుంది. ప్రతిపక్షాల ఐక్యతకు కాంగ్రెస్ సంకేతమిచ్చి చర్చలు జరపాలని భావిస్తున్నట్లు రాయ్‌పూర్‌లో జరిగిన కాంగ్రెస్ ప్లీనరీ ప్రకటన తెలియజేసింది. ప్రతిపక్షం ఐక్యతకోసం కృషి చేయడానికి బిహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్, ఎన్‌సీపీ నేత శరద్‌పవార్ తదితరులు సిద్ధంగానే ఉన్నారు. రెండు రోజుల క్రితం తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ పుట్టినరోజు వేడుకకు హాజరైన వివిధ పార్టీలనేతలు ప్రతిపక్ష ఐక్యతకు తక్షణం చర్యలు తీసుకోవాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్‌లేని ప్రతిపక్ష ఐక్యత ప్రయోజనం కలిగించబోదని, గతంలో నితీశ్‌కుమార్, తాజాగా స్టాలిన్ ప్రకటించారు. మొదటి నుంచి సీపీఐ ఇతర వామపక్షాలు బీజేపీ నాయకత్వంలో మోదీ ప్రభుత్వ విధ్వంసకర విధానాల నుంచి ప్రజలను రక్షించడానికి ప్రతిపక్షం ఐక్యతను ప్రతిపాదించాయి. ఈ తరుణంలో మమత ప్రకటన అనేక అనుమానాలకు తావిస్తుంది. రాహుల్ గాంధీ జోడోయాత్ర సానుకూల పరిస్థితి ఈశాన్య రాష్ట్రాల్లో ఫలితాన్ని ఇవ్వలేదు. అయితే యాత్ర ప్రభావం అన్ని ప్రాంతాల్లో ఒకే విధంగా ఉండదు.

మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో పేదరికం, నిరుద్యోగం పెరిగాయి. పూర్తిగా ఆశ్రిత పెట్టుబడీదారీ విధానాన్ని అనుసరించడంతో కుబేరుల పెరుగుదల, పేదరికం మిక్కుటమయ్యాయి. మొత్తం జాతి ఆదాయంలో 50శాతం దిగువ, మధ్య తరగతి ప్రజల వద్ద సంపద 13శాతమేనని, జాతి సంపదలో వీటికి 3శాతమే ఉందని, అభివృద్ధిలో వీరికి దక్కింది అతిస్వల్పమని అంతర్జాతీయ ఆర్థిక నిపుణులు వెల్లడించిన గణాంకాలు తెలియ జేస్తున్నాయి. పెద్ద నోట్ల రద్దు, జీఎస్‌టీ, కొవిడ్ కాలంలో పరిశ్రమలు తదితర అన్ని రంగాలు మూతపడడానికి కారణమైన లాక్‌డౌన్ దేశ ప్రజల ఆర్థిక పరిస్థితులను తల్ల క్రిందులు చేశాయి. ఎన్నికల బాండ్ల ద్వారా దొడ్డిదారిన నల్ల ధనాన్ని ఈ ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. అవినీతి పెచ్చరిల్లింది. బీజేపీలో ఎంతటి అవినీతి పరులున్నా రనడానికి తాజాగా కర్ణాటక ఎంఎల్‌ఏ విరూపాక్ష కొడుకు ఇంట్లో నోట్ల కట్టల గుట్టలున్నాయని లోకాయుక్త దాడుల్లో వెలుగుచూసింది. తండ్రి తరపున కొడుకు కాంట్రాక్టరు నుండి రూ.40లక్షలు లంచం తీసుకొంటుండగా పట్టుబడ్డాడు. ఇలాంటి అవినీతి పరులను రక్షిస్తూ ప్రతిపక్షనాయకులపై అవినీతి ముద్రవేసి వేధిస్తున్నారు. మేధావులపైన వివిధ రకాల ఆరోపణలుచేసి తప్పుడు కేసులు బనాయించి ఏళ్లతరబడి జైల్లో పెట్టి హింసిస్తున్నారు.

నేటి పాలకులు రాజ్యాంగ సంస్థలైన ఎన్నికల కమిషన్, సీబీఐ, ఈడీ లాంటి సంస్థల స్వతంత్రతను హరించిన ప్రభుత్వం వీటిని సొంత ప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటున్నారు. సర్వరంగాల్లో కీలకస్థానాల్లో స్వాతంత్ర్యపోరాటం పాత్రలేని, దేశాన్ని హిందూ రాష్ట్రంగా మార్చాలన్న లక్ష్యంతో పనిచేస్తున్న సంఘ్‌పరివార్ కార్యకర్తలను నింపుతున్నారు. ప్రభుత్వరంగంలో ప్రజల కష్టార్జితంతో నిర్మించిన సంస్థలన్నింటినీ ఆశ్రిత పెట్టుబడి దారులకు కారుచౌకగా కట్టబెడుతున్నారు. ఇచ్చి పుచ్చుకునే విధానాన్ని అవలంబిస్తున్నారు. బహుళత్వాన్ని నాశనంచేసి మెజారిటీ మతాన్ని అన్ని విధాలుగా ప్రలోభపెట్టి ఓట్లు పొంది ఇష్టానుసారంగా ప్రజాస్వామ్య రహితంగా ఫాసిస్టు భావజాలంతో పాలిస్తున్న ఈ శక్తుల నుంచి విముక్తి కల్పించడానికి ప్రతిపక్ష ఐక్యత నేటి అవసరం. ఇదిజరగకపోతే దేశ స్వరూపం ఇలాగే ఉంటుందన్న హామీలేదు. దేశం తీవ్ర ప్రమాదంలో పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. మోదీ సన్నిహితుడు గౌతం అదానీ లాంటి వారు మిక్కుటమవుతారు. కుంభకోణాలకు పాల్పడి ప్రజలను కష్టాలపాలు చేసే మోసకారులు పెరుగుతారు. ఈ పరిస్థితులుమారి ప్రజలకు మేలు జరగాలంటే ప్రత్యామ్నాయ ప్రభుత్వ ఏర్పాటు జరగాలి. ఈ లక్ష్యానికి తూట్లు పొడిచే వారు ప్రజాద్రోహులుగా మిగిలిపోవచ్చు.

తెలంగాణలో తమిళ పార్టీ..!

సార్వత్రిక ఎన్నికలకు సమయం దగ్గరవుతున్న సమయంలో తెలంగాణ రాజకీయాలు రసవత్తరంగా మారుతున్నాయి. అధికార, ప్రతిపక్ష పార్టీలు ఇప్పటికే తమ తమ వ్యూహరచన సిద్ధం చేసుకోగా, మిగిలిన పక్షాలు కూడా అదేదారిలో నడుస్తూ ప్రణాళికలకు పదును పెడుతున్నాయి. రానున్న ఎన్నికల్లో తమ సత్తా చూపేందుకు అస్త్రశస్త్రాలు సిద్ధం చేసుకుంటున్నాయి. సామాజిక సమీకరణల్లో భాగంగా కొన్ని వర్గాల నేతలు ఇప్పటికే సొంత పార్టీలు పెట్టుకొని భూమికను సిద్ధం చేసుకుంటుండగా, తాజాగా తెలంగాణ రాజకీయ యవనికపై మరో కొత్త పార్టీ పురుడు పోసుకుంది. ఇప్పటికే తమిళనాట స్టాలిన్ ఆధ్వర్యంలోని ద్రవిడ మున్నేట్ర కజగం(డీఎంకే) ముఖ్య భాగస్వామిగా ఉంటూ, ఒక లోక్‌సభ, నాలుగు శాసనసభ సభ్యులున్న 'విడుతలై చిరుతైగళ్ కచ్చి'(వీసీకే) అనే పార్టీ గత శుక్రవారం తెలంగాణలో పాదం మోపింది. వీసీకే వ్యవస్థాపక అధ్యక్షులు, చిదంబరం లోక్‌సభ సభ్యుడు తోల్ తిరుమా వలవన్ శుక్రవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'వీసీకే తెలంగాణ పార్టీ'ని ప్రకటించారు. నిజానికి వీసీకే పార్టీ బీఆరెస్‌లో విలీనం కానున్నదని, ఖమ్మంలో జరిగిన బీఆరెస్ ఆవిర్భావ సభలోనే విలీన ప్రకటన ఉండవచ్చని భావించారు. ఆమేరకు వీసీకే పార్టీ వ్యవస్థాపకుడు, చిదంబరం తిరుమావలవన్, తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ మధ్య సుదీర్ఘమంతనాలు కూడా జరిగాయి. ఏమైందో ఏమో తెలియదు కాని, విలీనంకాకపోగా ఏకంగా తెలంగాణలో వీసీకేపార్టీ ఆవిర్భావప్రకటన వెలువడింది. ఆరెస్సెస్, బీజేపీలకు వ్యతిరేకంగా ప్రజా స్వామ్య, లౌకిక విలువల బలోపేతానికి తమ పార్టీ పనిచేస్తుందని, భావ సారూప్యత కలిగిన, ఆరెస్సెస్, బీజేపీ భావజాలానికి వ్యతిరేకంగా పోరాడే అన్నిపార్టీలతో అవగాహనతో పనిచేస్తామని, అందులో భాగంగా తెలంగాణలో బీఆరెస్‌తో కలిసి ప్రయాణించడానికి తాము సిద్ధంగా ఉన్నామని తిరుమా వలవన్ ప్రకటించారు. తెలంగాణ అధ్యక్షుడుగా డా.జిలుకర శ్రీనివాస్, ప్రధానకార్యదర్శిగా ఏ.ఎం షుఐబ్‌లను నియమించారు. వీసీకేను బీఆరెస్‌లో విలీనం చేస్తాడనుకున్న తిరుమా వలవన్ తెలంగాణలో కొత్త దుకాణం తెరవడం, మళ్ళీ కలిసి పనిచేస్తానని చెప్పడం ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అంతగా మింగుడుపడడంలేదు. ఇప్పటివరకూ జిలుకర ఆధ్వర్యంలో నడుస్తున్న ద్రవిడ బహుజన సమితి (డీబీఎస్)ను వీసీకేలో విలీనం చేశారు. తెలంగాణలో వీసీకేపార్టీ ఆవిర్భావంతో రకరకాల ఊహాగానాలకూ తెరలేచింది.

మాజీ ఐపీఎస్ అధికారి ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో బహుజన సమాజ్ పార్టీ (బీఎస్‌పీ) తెలంగాణలో రాజ్యాధికారసాధన నినాదంతో పని చేస్తుండగా బహుజనులకోసం మరో రాజకీయ పార్టీ అవసరం ఏమున్నదని కొందరు బహుజన వాదులు పెదవి విరుస్తున్నారు. ఈ పార్టీ నాయకుడి ప్రయాణం సరైన మార్గంలో సాగడంలేదని, అంబేద్కరిజాన్ని సమర్థవంతంగా ప్రెజెంట్ చేయడంలో ఆయన విఫలమవుతున్నాడని, ఆయన వ్యవహార శైలి 'పరివార్' భావజాల బలోపేతానికి ఉపకరించే విధంగా ఉందని మరికొందరు అంబేద్కరిస్టులు అభిప్రాయ పడుతున్నారు. ప్రవీణ్ కుమార్ బీఆరెస్‌కు వ్యతిరేకంగా ఎంత గట్టిగా పనిచేస్తే అంత ఎక్కువగా బీజేపీకి ప్రయోజనం కలుగుతుంది. అందుకే సాధ్యమైనంత మేర పార్టీలమధ్య, కులాలమధ్య, మతాలమధ్య విభజన వాదాన్ని రెచ్చగొట్టి, ఎవరికి వారు విడివిడిగా పోటీ చేసేలా జాగ్రత్తలు తీసుకుంటూ బీజేపీ ప్రణాళికలు రచించింది. సామ దాన బేధ దండోపాయాల ద్వారా తన దారికి తెచ్చుకునే ప్రయత్నమూ చేస్తోంది. బహుజనవాదుల చీలిక బీజేపీకి గొప్పవరం అనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. చీలికలు పీలికలై ఎవరి దారిన వారు ఎన్నికలకు వెళితే సాలిడ్ ఓటు బ్యాంకును పొందవచ్చని, తద్వారా తెలంగాణలో జెండా పాత వచ్చని బీజేపీ సంబరపడుతోంది. అందుకని అంబేద్కరిజాన్ని భుజానికెత్తు కున్న వాళ్ళు అప్రమత్తంగా ఉండాలి. తమ మధ్యఉన్న పొరపొచ్చాలను పక్కనపెట్టి, అహం భావానికి పోకుండా సైద్ధాంతికపునాదులపై కలిసి పనిచేసేందుకు ముందుకు రావాలి. అప్పుడు మాత్రమే శత్రువును ఎదుర్కొనే, నిలువరించేశక్తి లభిస్తుంది. మొత్తానికి బీఎస్‌పీ, వీసీకేలు అలాగే అంబేద్కరిస్టులు అనుకునే ప్రతి ఒక్కరూ ఒకర్నొకరు నిందించుకుంటూ శత్రువుకు ఆయుధం అందించి, మేలుచేసే బదులు సంయమనంతో, సమన్వయంతో, పరస్పర అవగాహనతో, ఇప్పటికే బీజేపీకి వ్యతిరేకంగా నిబద్ధతతో పనిచేస్తున్న వామపక్ష పార్టీల సహకారంతో కలిసి పని చేయాల్సిన అవసరమైతే ఉంది. రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి, సెక్యులర్‌విలువలకు ముప్పుగామారిన 'పరివార్' భావజాలాన్ని అడ్డుకోవా లంటే, నిలువరించాలంటే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ బహుజనులను చైతన్యపరచడంతో పాటు, అగ్రకులాల్లోఉన్న అసంఖ్యాకమంది సెక్యులర్ వాదుల సేవలను వినియోగించుకోవలసిన అవసరంఉంది. ఈ విషయంలో తమిళనాట కొంతమేర విజయం సాధించిన అనుభవంతో తెలంగాణలో అడుగు పెట్టిన వీసీకే ఈ మహత్తర లక్ష్య సాధనలో ఏ మేరకు విజయం సాధిస్తుందో కాలమే చెప్పాలి. ఏది ఏమైనా ఆరెస్సెస్, బీజేపీల నిలువరింతకు, నిర్మూలనకు ఎవరు ముందు కొచ్చినా స్వాగతించాల్సిందే. డా.జిలుకర శ్రీనివాస్, ఏ ఎం షుఐబ్‌ల నాయకత్వంలో వీసీకే పార్టీ తెలంగాణలో ఆశాజనక స్థాయిలో ప్రభావం చూపాలని, చూపగలదని ఆశిద్దాం.

- యండి. ఉస్మాన్ ఖాన్, సీనియర్ జర్నలిస్టు

వివాదంగా మారిన ఆర్‌ఎస్‌ఎస్-జమాతే చర్చలు!

ఎంకెఆర్

> ఆర్‌ఎస్‌ఎస్‌కు భయపడి దానితో సఖ్యత కోరుకుంటున్నట్లు, స్వార్థ ప్రయోజనాలున్నట్లు కొందరు జమాతేను విమర్శించారు. స్నేహపూర్వక చర్చలద్వారా జమాతే చారిత్రక తప్పిదం చేసిందని కేరళ ముస్లిం జమాత్ కాంతాపురం ఏపి అబూబకర్ ముస్లియార్ చెప్పారు. ఆర్‌ఎస్‌ఎస్ భారత్‌కు, దేశ లౌకిక విలువలకు శత్రువని అటువంటి సంస్థతో చర్చలు శత్రువును కౌగలించుకోవటంతో సమానమని ముస్లిం జమాత్ పేర్కొన్నది. మతవాదం ఈ రెండు బృందాలను ముడివేస్తున్నది. భారత వ్యతిరేక ఫాసిస్టు శక్తుల నిజరూపాన్ని కప్పిపుచ్చేందుకు జమాతే ఇస్లామీ హింద్ ఒక పనిముట్టుగా మారుతున్నది " అని విమర్శించింది. ఆర్‌ఎస్‌ఎస్‌తో చర్చించాల్సినంత ప్రత్యేక పరిస్థితులేమీ లేవని ముస్లింలీగ్ నేతలు పికె కున్హాలికుట్టి, ఎంకె మునీర్ పేర్కొన్నారు.

ప్రస్తుతం మన దేశంలో ఆర్‌ఎస్‌ఎస్‌కు ఏదీ అసాధ్యం కాదు. కొద్ది వారాలక్రితం ఢిల్లీలో ఆర్‌ఎస్‌ఎస్‌తో కొన్ని ముస్లిం సంస్థల ప్రతినిధుల సమావేశం ఇప్పుడు కేరళలో వేడిపుట్టిస్తున్నది. కేంద్ర ప్రభుత్వం కేరళపై అనుసరిస్తున్న వైఖరికి నిరసనగా అక్కడి సిపిఐ(ఎం) ఫిబ్రవరి 21 నుంచి నెలరోజులు సాగే జాతాను కోజికోడ్‌లో సిఎం పినరయి విజయన్ ప్రారంభించారు. ఆ సందర్భంగా సిఎం ముస్లింలను బుజ్జగించేందుకు చూసినట్లు బీజేపీ ధ్వజమెత్తింది. అంతకు ముందే ఆర్‌ఎస్‌ఎస్‌తో కేరళకు చెందిన జమాయతే ఇస్లామిక్ హింద్ సంస్థ ప్రతినిధులు దేన్ని గురించి చర్చించారో చెప్పాలంటూ పినరయి విజయన్ లేవనెత్తిన ప్రశ్న వేడిపుట్టించింది. దాన్ని పక్కదారి పట్టించేందుకు బీజేపీ ఎదురుదాడికి పూనుకుంది. సదరు సమావేశం గురించి ఇంతవరకు ఆర్‌ఎస్‌ఎస్ ఎలాంటి వివరణ ఇవ్వలేదు. తమంత తాముగా వెళ్లి కలవలేదని ఆర్‌ఎస్‌ఎస్ ఆహ్వానం మేరకు వెళ్లినట్లు జమాతే వివరణ ఇచ్చుకుంది. అది వాస్తవం కాదని వార్తలు చెబుతున్నాయి.

జమాతే సంస్థ ప్రధాన కార్యదర్శి టి ఆరిఫ్ జనవరిలో ఆర్‌ఎస్‌ఎస్‌తో జరిపిన చర్చల గురించి వెల్లడించారు. దేశంలోని అనేక ప్రాంతాల్లో జరుగుతున్న మూక దాడులు, వధలు, అట్టడుగు తరగతుల అణచివేతలపై చర్చించినట్లు పేర్కొన్నారు. ఇది జమాతే వంచన తప్ప మరొకటి కాదని విజయన్ ఫేస్‌బుక్ పోస్టులో పేర్కొన్నారు. "ఆర్‌ఎస్‌ఎస్‌తో విబేధించే అంశాలున్నప్పటికీ చర్చలు జరపాల్సిఉందని జమాతే చెప్పటం దాని వంచనను వెల్లడిస్తున్నది. ఏమి చర్చించారో, సమావేశం ఏ అంశం మీద జరిగిందో వివరించాలి. జమాతే తర్కం ప్రకారం ఆర్‌ఎస్‌ఎస్ ఒక సంస్థ, చర్చల ద్వారా దాన్ని సంస్కరించవచ్చు, మార్చవచ్చు. ఇదెలా అంటే తోడేలు మచ్చలను నీటితో కడిగి పోగొట్టవచ్చు అన్నట్లుగా ఉంది. భారత్‌లోని మైనారిటీలు ఉమ్మడిగా ఎదుర్కొంటున్న సమస్యలను దేశ యంత్రాంగాన్ని అదుపుచేస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ ముందుంచుతామని వాదనచేస్తున్న జమాతేకు అసలు దేశ మైనారిటీల ప్రతినిధిగా ఎవరు అధికారమిచ్చారు? ఏ అంశం గురించి చర్చించినప్పటికీ అది దేశంలోని మైనారిటీలకు సాయపడదు. మైనారిటీల రక్షణఅంటే మతస్వేచ్ఛకు రక్షణ. దాన్ని విచ్ఛిన్నం చేస్తున్నదెవరో చర్చల్లో పాల్గొన్నవారికి తెలియదా? అలాంటి వారితో చర్చించి లౌకికవాదాన్ని, మైనారిటీలను ఎలా రక్షించగలం? సంఘపరివార్ తీవ్రవాద హిందూత్వ రాజకీయాలకు వ్యతిరేకంగా నేడు దేశంలోని లౌకిక శక్తులు పోరాడు తున్నాయి. ఇటువంటి దశలో అలాంటి చర్చలు ఆర్‌ఎస్‌ఎస్ అజండాకు మద్దతు ఇస్తాయి. మతతత్వశక్తులు కుమ్మక్కై ఐక్యంగా లౌకికవాదాన్ని, ప్రజాస్వామిక విలువలను అణచివేస్తున్నాయనేందుకు ఇంతకంటే రుజువు అవసరంలేదు. లౌకిక శక్తులకు ఇదొక సవాలు అని విజయన్ పేర్కొన్నారు. జమాతే వైఖరిని కేరళలోని కేరళ ముస్లిం జమాత్, సమస్త కేరళ జమైతుల్ ఉలేమా, ముస్లింలీగ్, కేరళ నదవతుల్ ముజాహిదీన్, సున్నీ యువజన సంఘం విమర్శించాయి.

ఆర్‌ఎస్‌ఎస్‌కు భయపడి దానితో సఖ్యత కోరుకుంటున్నట్లు, స్వార్థ ప్రయోజనాలున్నట్లు కొందరు జమాతేను విమర్శించారు. స్నేహపూర్వక చర్చలద్వారా జమాతే చారిత్రక తప్పిదం చేసిందని కేరళ ముస్లిం జమాత్ కాంతాపురం ఏపి అబూబకర్ ముస్లియార్ చెప్పారు. ఆర్‌ఎస్‌ఎస్ భారత్‌కు, దేశ లౌకిక విలువలకు శత్రువని అటువంటి సంస్థతో చర్చలు శత్రువును కౌగలించుకోవటంతో సమానమని ముస్లిం జమాత్ పేర్కొన్నది. మతవాదం ఈ రెండు బృందాలను ముడివేస్తున్నది. భారత వ్యతిరేక ఫాసిస్టు శక్తుల నిజరూపాన్ని కప్పిపుచ్చేందుకు జమాతే ఇస్లామీ హింద్ ఒక పనిముట్టుగా మారుతున్నది " అని విమర్శించింది. ఆర్‌ఎస్‌ఎస్‌తో చర్చించాల్సినంత ప్రత్యేక పరిస్థితులేమీ లేవని ముస్లింలీగ్ నేతలు పికె కున్హాలికుట్టి, ఎంకె మునీర్ పేర్కొన్నారు.

ముస్లిం సంస్థలతో ఆర్‌ఎస్‌ఎస్ జరిపిన రహస్య సమావేశం గురించి జనవరి 26న హిందూ పత్రిక వెల్లడించింది. సంఘపరివార్ నేతలు ఇంద్రేష్ కుమార్, రామ్‌లాల్, కృష్ణ గోపాల్ మూడు గంటలపాటు ఢిల్లీలోని మాజీ లెఫ్టినెంట్ గవర్నర్ నజీబ్‌జంగ్ నివాసంలో జరిపిన భేటీలో అనేక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. జమాతే ఇస్లామీ హింద్, జమాతే ఉలేమా ఇ హింద్, అజ్మీర్ దర్గా సల్మాన్ చిస్తీ, తదితరులు ఉన్నారు. గతేడాది ఆగస్టులో ఇలాంటి సమావేశమే జరగ్గా ఆర్‌ఎస్‌ఎస్ అధిపతి మోహన్ భగవత్, నజీబ్ జంగ్, మాజీ ఎన్నికల కమిషనర్ ఎస్‌వై ఖురేషీ, ప్రముఖ హెూటల్ ఓనరు సయిద్ షెర్వానీ, జర్నలిస్టు షాహిద్ సిద్దిఖీ, మరికొందరు పాల్గొన్నారు. దాని కొనసాగింపుగా జరిగిన జనవరి సమావేశంలో భగవత్ మినహా మిగిలిన ముస్లింప్రతినిధులంతా పాల్గొన్నట్లు కూడా హిందూపత్రిక పేర్కొన్నది. ఇలాంటి సమావేశాలను తరచూ జరపటంద్వారా సానుకూలసందేశాన్ని పంపటం ముఖ్యమని భాగస్వాములైన ఆర్‌ఎస్‌ఎస్ నేతలు భావించారు. ఈ దశలో సంస్థల అధిపతులు, సీనియర్ నేతలు రావటం మంచిది కాదని భావించి, సమావేశాలను తరువాత కూడా కొనసాగించాలని భావించినట్లు వెల్లడించింది.

ఆర్‌ఎస్‌ఎస్-జమాతే ఇస్లామీ హింద్ ప్రతినిధుల చర్చలు వెల్ఫేర్ పార్టీ బుర్రలోపుట్టిన ఆలోచనకాదా అని సిఎం విజయన్ కోజికోడ్ సభలో విమర్శించారు. కాంగ్రెస్‌లోని కొంతమంది ఆర్‌ఎస్‌ఎస్‌పై సానుకూల వైఖరితో ఉంటారు. వెల్ఫేర్ పార్టీ, జమాతేపై ముస్లింలీగ్‌లోని కొందరు అదే విధంగా ఉంటారని అందువలన ఆ మూడుపార్టీలమధ్య ఉన్న ప్రత్యేకబంధం ఏమిటో, చర్చలగురించి జవాబుచెప్పాలని డిమాండ్‌చేశారు. కేంద్రానికి కేరళ అభివృద్ధి పట్టదు, ప్రతిపక్ష కూటమి మౌనంగా ఉంటుంది, కేంద్రం మీద ఒక్క మాట కూడా మాట్లాడదు అన్నారు. ఈ సభలో సిఎం పినరయి విజయన్ ప్రస్తా వించిన మూడుసార్ల తలాక్ అంశంపై బీజేపీ, కొన్ని మీడియాసంస్థలు వక్రీకరణలకు పూనుకున్నాయి. మూడుసార్లు తలాక్‌చెప్పి భార్యను వదలి వేయటానికి సిపిఎం వ్యతిరేకం అన్నసంగతి తెలిసిందే. అది చెల్లదని సుప్రీంకోర్టు కూడా చెప్పింది కనుక దానిమీద వేరే చట్టం అవసరం లేదన్నది సిపిఎం వైఖరి. అందువలన దానిమీద చట్టంచేసేందుకు ఆర్డినెన్స్‌జారీని సిపిఎం ఖండించింది. తరువాత పార్లమెంటు బిల్లును ఆమోదించింది. దాని ప్రకారం అలా ఎవరైనా విడాకులు తీసుకుంటే మూడు సంవత్సరాలవరకు శిక్ష వేయ వచ్చు. ఇతర మతాలకు చెందిన వారి విడాకుల వివాదాన్ని సివిల్ కేసులుగా పరిగణించి ముస్లింపట్ల క్రిమినల్‌కేసుగా పరిగణించటాన్ని మాత్రమే సిపిఎం వ్యతిరేకిస్తున్నది తప్ప మూడుసార్ల తలాక్‌ను సమర్థించలేదు. సిఎం పినరయి విజయన్ దాన్నే చెప్పారు తప్ప ముస్లింలను సంతృప్తిపరచలేదు.

మనిషి పక్షాన గొంతెత్తిన పేరలింగం

డాక్టర్ దేవరాజు మహారాజు

అతనొక నిత్యచైతన్య ఉద్యమ తరంగం. పేరు- దేవగుప్తపు పేరలింగం. రాజమండ్రిలో ఒక సాధారణ కార్మికుడు. ఎక్కువగా చదువు కోలేదు. కానీ, ఆయన కృషి గురించి తెలుసుకుంటే గొప్ప గొప్ప విద్యావేత్తలు సైతం సిగ్గుతో తలదించుకోవల్సిందే! ఇప్పుడు ఆయన వయసు ఎనభై సంవత్సరాలు. జీవిత కాలమంతా ఒంటరిగానే సైన్సు-హేతువాద ప్రచారంలో తలమునకలై గడిపారు. తనసైకిల్‌కు "హేతువాద చైతన్యరథం" అని బోర్డు తగించుకుని, వెనక సీటుమీద పుస్తకాల సంచి పెట్టుకుని, గోదావరి జిల్లాలో ఊరూరా తిరిగేవారు. గ్రామీణ ప్రజల్లో మూఢనమ్మకాలు తగ్గించ డానికి జీవితాన్ని ధారపోశారు. నిక్కరు, ఆఫ్ షర్టు వేసుకుని, కాళ్లకు స్లిప్పర్స్‌తో సైకిల్‌మీద మారుమూల గ్రామాలన్నీ తిరిగే పేరలింగాన్ని ఆ ప్రాంతంలో అందరూ గుర్తుపడతారు. 1942 సెప్టెంబరు 6న దేవగుప్తపు పేరలింగం ఒక పేద వడ్రంగి కుటుంబంలో జన్మించారు. ఆ రోజుల్లో వారికి చదువుకునే అవకాశం లేదు. అయినా, అంతర్గతంగా అక్షరాలపట్ల పొంగుకొచ్చిన ప్రేమాభి మానాల వల్ల తెలుగు అక్షరాలు నేర్చుకోగలిగారు. ఉన్నత విద్య సాధించలేకపోయినా తన పరిమితమైన పరిజ్ఞానం తోనే ప్రశ్నించడం నేర్చుకున్నారు. ప్రశ్న-ఆయనలో శోధన శక్తిని తట్టి లేపింది. ఆ ప్రశ్నతో, ఆ శోధనతో హేతువాదిగా మారారు.

1980లలో రాజమండ్రి హేతువాదానికి మంచి కేంద్రంగా ఉండేది. రావిపూడి వెంకటాద్రి, పెన్మెత్స సుబ్బరాజు, కత్తి పద్మారావు మొదలైన వారంతా రాజమండ్రి సుబ్రహ్మణ్య మైదానంలో సభలు నిర్వహించే వారు. వేల సంఖ్యలో జనం హాజరయ్యేవారు. ఆ వేల మందిలో ఈ డి.పేరలింగం ఒకరు. ఆ ఒక్కడు ఒక్కడిగా మిగిలిపోలేదు. ఒక్క దీపం వందలవేల దీపాలు వెలిగించి నట్లు- ఆ ఒక్కడే, తను సముపార్జించిన హేతువాద పరిజ్ఞానం ఊరూరా తిరిగి ప్రచారంచేయడం ప్రారంభించారు. ఆ రోజుల్లో గాలి శేషగిరిరావు అనే ప్రసిద్ధ ప్రవచనకారుడు ఉండేవారు. హేతువాదులంతా కలిసి, అదే సుబ్రహ్మణ్య మైదానంలో ఆ ప్రవచనకారుడి బండారం ప్రజల ముందుపెట్టారు. అది కళ్లారా చూసిన పేరలింగం తన ప్రచారకార్యక్రమాలకు రూపకల్పన చేసుకున్నారు. ఒకసారి అనారోగ్యంతో కదలకుండా ఇంటిపట్టున ఉండాల్సివస్తే, ఆయన ఆ సమయాన్ని పుస్తక పఠనానికి, అధ్యయనానికి వినియోగించారు. సమయం వృధాచేయకుండా తన ధ్యేయానికి అనువుగా మలచుకున్నారు.

వాస్తవం ఎప్పుడూ వాస్తవమే. అది అబద్ధాలకు లొంగకూడదు. అని నిర్ణయించుకుని, జనంలో తిరగ డానికి, హేతువాద ప్రచారానికి ఉద్యమించారు. తనకు తెలిసిన, తను తెలుసుకున్నఅంశాలు సరళమైన తెలుగులో రాయడానికి కూడా ప్రయత్నించారు. అలా కొన్ని చిన్న చిన్నపుస్తకాలు తయారయ్యాయి. అయితే అవి అచ్చేయడం ఎలాగో, అవి జనానికి అందించడం ఎలాగో ఆయనకు అప్పటికి తెలియదు. అందుకు కావల్సిన డబ్బు కూడా ఆయన దగ్గర లేదు. ఒకసారి రాజమండ్రి దగ్గరలో ఉన్న కడియం మండలకేంద్రంలో హేతువాదులు కలుస్తున్నారని పేరలింగానికి తెలిసింది. అంతే, ఆయన హుటాహుటిన అక్కడికి వెళ్లారు. సైకిల్‌మీద ఊరూరూతిరిగి హేతువాదం ప్రచారం చేస్తున్న ఈ పెద్ద మనిషిని అక్కడ కొందరు గుర్తించారు. తనుకొన్ని చిరుపొత్తాలు రాశానని అవి ఎలా ఎక్కడ అచ్చేయాలో తనకు తెలియదని ఆయన సభలో చెప్పారు. వెంటనేఅక్కడున్న యువకులంతా స్పందించారు. ఉన్న పళంగా నలభైవేలు పోగుచేసి ఇచ్చారు. ప్రజాపత్రిక సంపాదకుడు సుదర్శన్, ఆయన శ్రీమతి దేవి ముందు కొచ్చారు. ప్రచురణ బాధ్యత తమ మీద వేసుకున్నారు. ప్రూఫ్‌లన్నీ స్వయంగా సుదర్శనే చూసేవారు. ఆ రకంగా దేవగుప్త పేరలింగం అనే హేతువాద కార్యకర్త జనానికి రచయితగా పరిచయమయ్యారు. నలభైఏళ్ల క్రితమే

సేకరణ, కూర్పు: డి.పేరలింగం, హేతువాది

1982 నుంచి హేతువాద రథసారథిగా నిత్య హేతువాద ప్రచారం చేస్తున్న పేరలింగం ఇదే ఆయన హేతువాద చైతన్యరథం (సైకిల్)

తెలుగునాట మనిషి కేంద్రంగా గొంతెత్తిన గళంగా, కలంగా ఆయన నిలబడిపోయారు. ఆరు ఏడేళ్లకాలంలో పదికి పైగా పుస్తకాలు ప్రచురించారు.

ఆయన పుస్తకాల శీర్షికలు కొన్ని ఇలా ఉన్నాయి. 1. ప్రాచీన కులసంస్కృతి-సామాజికప్రగతి 2. ఓ మహిళా నీకు మతమెందుకమ్మా? 3. సైన్సు ఫ్లస్ మూఢనమ్మకాలు 4. బైబిల్-శాస్త్రీయం విశ్లేషణ 5. ఆది మానవుడు మొలకు ఆకులు కట్టుకున్నది సిగ్గువల్ల కాదు. 6. మత తత్వం స్త్రీ వ్యక్తిత్వం 7. పట్టువదలని హేతువాది విక్రమార్కుడు పేరలింగం-స్వగతం (జీవితచరిత్ర) 8. మంత్రాల్లో దాగి ఉన్న బూతుల మర్మం 9. వరూధిని వివాహం- హేతువాద సూక్తులు 10. శ్రీ వేంకటేశ్వర సుప్రభాత శృంగారం 11. పాకలపాటి వారి సంక్షిప్త చరిత్ర. ఈ పుస్తకాల శీర్షికలు చూస్తేనే ఆయన ఆలోచనా ధోరణి, వ్యక్తిత్వం కొంతలో కొంత అర్థమవుతుంది. ఆయనకు ఇప్పుడు ఎనభై ఏళ్లు పూర్తయిన సందర్భంగా అభ్యుదయ ప్రజా సంఘాల ఐక్య సమాఖ్య-రాజమహేంద్ర వరం (ఫోన్:903209442/ 9502654774) వారు రాజమండ్రిలోని ప్రదీప్ కేర్ ఆసుపత్రిలో 2022సెప్టెంబరు 4న అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. జీవనసాఫల్య పురస్కారం అందించారు. ఇలాంటి నిస్వార్థ జీవుల్నిగుర్తించి గౌరవించుకోవడం మనకర్తవ్యం. ఎటు నుండి ఏ ఆధారమూ లేని పేరలింగం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందిస్తున్న వృద్ధాప్యపు పెన్షన్‌తో ప్రస్తుతం జీవనం సాగిస్తున్నారు. అలాంటి నిస్సహాయ పరిస్థితుల్లో ఉండికూడా నేటి కేంద్ర ప్రభుత్వ పెద్దలు పెంచి పోషిస్తున్న మతోన్మాదాన్నిఎదుర్కొని నిలబడటం మాటలు కాదుగదా?

ఎక్కువగా చదువుకోనందుకు, వడ్రంగి కార్మికుడిగా జీవనం సాగిస్తున్నందుకు, దయనీయమైన స్థితిలో ఉండికూడా మేతువాదం మాట్లాడుతున్నందుకు భూ స్వాములు, ధనవంతులు, అగ్రవర్ణాల వారినుండి ఎన్నో అవమానాలు ఎదురయ్యేవి. ఓపికగా పేరలింగం అన్నింటినీ సహించారు. నిశ్శబ్దంగా తన పనిలో తాను నిమగ్నమయ్యేవారు. తలవంచుకుని వెళ్లిపోయేవారు. విద్యావంతులైన మూర్ఖుల్ని ఎదుర్కొని చలాకీగా తిప్పికొట్ట గల సామర్థ్యం లేనందువల్ల-వక్తగా, రచయితగా గుర్తింపు పొందే అవకాశం లేక చాలా కాలం కార్యకర్తగానే జనంలో ఉండిపోయారు. అలా కూడా ఎన్నో దాడులకు, బెదిరింపులకు గురయ్యారు. అయినా గత మూడు దశాబ్దాలుగా ఆయన ఎన్నడూ అధైర్యపడలేదు. వెనకడుగు వేయలేదు. అమాయక గ్రామీణుల మెదళ్లలో ప్రశ్నలు మొలిపిస్తూ సనాతనసంప్రదాయాల మోసాలు బట్టబయలు చేస్తూ, తన చైతన్య రథాన్ని ముందుకు దూకించేవారు. నిజానికి అది చాలా గొప్ప విషయం ఇప్పటికీ మనం అనుసరించాల్సిన అంశం ఇదే. పేరలింగం వలె గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలలు, కళాశాలలు విస్తృతంగా తిరిగి, విద్యార్థుల్ని అక్కడిపౌరుల్ని చైతన్యవంతులుగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉంది.

ఒకవైపు ఒక చక్కటి సైన్సుగ్రంథాలయం నెలకొల్పి, పదిమందికి జ్ఞానం పంచుతూ, మరోవైపు దైవ మహిమలు చూపినవారికి లక్షరూపాయల బహుమతి ఇస్తానని ఛాలెంజ్‌చేయడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ఆర్థికంగా ఏ మాత్రం నిలదొక్కుకోని జీవితంతో పోరాడుతూ, హేతువాద విషయం వచ్చేసరికి ఏ మాత్రం వెనక్కి తగ్గకుండా ఉండగలగడం ఆయన నిబద్ధతకు, నిజాయితీకి నిదర్శనం! పేరలింగం గారు. తన ముగ్గురు కొడుకులను హేతువాదపద్ధతిలో వివాహాలు జరిపించారు. ఎన్ని ఆరోగ్య సమస్యలున్నా, వినికిడి శక్తి బాగా కోల్పోయినా, ఆయన తన ధ్యేయంనుండి తన దృష్టి మరల్చడంలేదు. ఒక ఆదర్శానికి కట్టుబడిజీవించడం మనం సమకాలీనంలో చాలా అరుదుగా చూస్తాం. అలాంటి అరుదైన వ్యక్తుల్లో చాలా అరుదైనవారు దేవగుప్తపు పేరలింగం. సామాన్యుల్లో అసమాన్యుడు.

-కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు విజేత, జీవశాస్త్రవేత్త

సిసోడియా సీబీఐ కస్టడీ పొడిగింపు

న్యూఢిల్లీ: మద్యం పాలసీకి సంబంధించిన అవినీతి కేసులో అరెస్టయిన ఢిల్లీ మాజీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా సీబీఐ కస్టడీని ఢిల్లీ కోర్టు మరో రెండు రోజులు పొడిగించింది.సిసోడియాను సోమవారం తమ ముందు ప్రవేశపెట్టాలని సీబీఐని ప్రత్యేక జడ్జి ఎంకే నాగపాల్ ఆదేశించారు. మూడు రోజుల సీబీఐ కస్టడీ పూర్తికావడంతో సిసోడియాను కోర్టులో హాజరుపరిచారు. మరో మూడు రోజులు తమ కస్టడీకి ఇవ్వాలని సీబీఐ కోరగా జడ్జి రెండు రోజులకే అనుమతిచ్చారు. కస్టడీలో సీబీఐ తనను బాగానే చూసుకుంటుందని సిసోడియా కోర్టుకు తెలిపారు. కాకపోతే అడిగిన ప్రశ్నలే మళ్లీ అడుగుతూ మానసిక వేధింపులకు గురిచేస్తోందని చెప్పారు. దీంతో అడిగిన ప్రశ్నే మళ్లీ మళ్లీ అడుగుతూ ఇబ్బంది పెట్టవద్దని సీబీఐని జడ్జి ఆదేశించారు. సిసోడియాను కోర్టుకు తీసుకొస్తుండటంతో రౌస్ అవెన్యూ కోర్టు పరిసరాల్లో పోలీసులు భారీ భద్రత చర్యలు చేపట్టారు. ఆప్ కార్యకర్తలు కోర్టు ఆవరణలో నిరసన ప్రదర్శించారు.

దేరాబాబాకు తరచూ పెరోల్‌తో శాంతిభద్రతల సమస్య

చండీగఢ్: ఇద్దరు శిష్యులపై అత్యాచారం చేసిన కేసులో 20 ఏళ్ల జైలు శిక్ష అనుభవిస్తున్న దేరా సచ్చా సౌదా చీఫ్ గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్‌కు తరచూ పెరోల్ మంజూరు చేయడం వల్ల రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్యలు తలెత్తే అవకాశం ఉందని పంజాబ్ ప్రభుత్వం హైకోర్టుకు తెలిపింది. దేరా చీఫ్‌కు పెరోల్ ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ శిరోమణి గురుద్వారా పర్బంధక్ కమిటీ (ఎస్‌జీపీసీ) పిటిషన్‌పై పంజాబ్ ప్రభుత్వం స్పందించడం, పిటిషన్‌కు హర్యానా ప్రభుత్వం ఇచ్చిన సమాధానానికి భిన్నంగా ఉంది. రామ్ రహీమ్ సింగ్‌కు పెరోల్‌ను సమర్థిస్తూ, హర్యానా ప్రభుత్వం పంజాబ్, హర్యానా హైకోర్టులో అతను కరుడుగట్టిన ఖైదీ కాదనీ, సీరియల్ కిల్లర్‌గా పేర్కొనలేమని తెలిపింది. జనవరి 20న దేరా చీఫ్‌కు 40 రోజుల పెరోల్ మంజూరైంది. 2017లో అత్యాచారం కేసులో దోషిగా తేలినప్పుడు హర్యానాలోని పంచకులలోని దేరా చీఫ్‌కు మద్దతుదారులు సృష్టించిన మారణహోమానికి పంజాబ్ ప్రభుత్వం కారణమని పేర్కొంది. సమాజంలోని కొన్ని వర్గాలు దేరా చీఫ్‌కు తరచుగా వచ్చే తాత్కాలిక పెరోల్‌ను చాలా కాలంగా జైలులో ఉన్న కొంతమంది వ్యక్తుల కేసులతో పోల్చవచ్చని కూడా కోర్టుకు తెలిపింది.

హిజ్బుల్ ముజాహిదీన్ ఉగ్రవాది ఆస్తులు జప్తు

శ్రీనగర్ : జమ్ముకశ్మీర్‌లోని కుప్వారా జిల్లాలో గత నెలలో పాకిస్తాన్‌లో హతమైన హిజ్బుల్ ముజాహిదీన్ (హెచ్‌ఎం) ఉగ్రవాది ఆస్తులను జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ) శనివారం జప్తు చేసింది. ఉత్తర కశ్మీర్ జిల్లాలోని క్రాల్‌పోరాలోని బాబర్‌పోరా ప్రాంతానికి చెందిన బషీర్ అహ్మద్ పీర్ ఆస్తులను పాకిస్తాన్ నుంచి పని చేస్తున్న ఉగ్రవాదులపై చర్యలో భాగంగా దర్యాప్తు సంస్థ జప్తు చేసినట్లు వారు తెలిపారు. ఫిబ్రవరి 21న రావల్పిండిలో కమాండర్‌గా చెప్పుకుంటున్న పీర్ కాల్పుల్లో హతమయ్యాడని అధికారులు తెలిపారు. నియంత్రణ రేఖ గుండా జమ్ముకశ్మీర్‌లోకి ఉగ్రవాదులను ప్రయోగించే బాధ్యత వహించిన పీర్‌ను ఉగ్రవాద కార్యకలాపాల్లో పాత్ర పోషించినందుకు చట్టవిరుద్ధ కార్యకలాపాల (నివారణ) చట్టం (ఉపా) కింద గత ఏడాది అక్టోబరు 4న కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాదిగా గుర్తించింది. లష్కరే తొయిబా, హిజ్బుల్ ముజాహిదీన్, ఇతర ఉగ్రవాద సంస్థలకు చెందిన కార్యకలాపాల విస్తరణ కోసం మాజీ ఉగ్రవాదులను, ఇతర శ్రేణులను ఐక్యం చేసేందుకు పీర్ అనేక ఆన్ లైన్ ప్రచారాల నిర్వహణలో పాల్గొన్నాడని కేంద్ర ఒక నోటిఫికేషన్‌లో పేర్కొంది.

త్రిపుర ప్రభుత్వ ఏర్పాటుకు ప్రధాని మోదీ

అగర్తల: త్రిపురలోని బీజేపీ–ఐపీఎఫ్‌టీ ప్రభుత్వం ఈనెల 8న ప్రమాణస్వీకారం చేయనున్నది. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ హాజరుకానున్నట్టు సీనియర్ అధికారి శనివారం తెలిపారు. ఇటీవల 60 స్థానాలున్న త్రిపుర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 32 స్థానాలు గెలుచుకోగా, మిత్రపక్షమైన ఐపీఎఫ్‌టీ ఒకస్థానం గెలుచుకుంది. 'రాష్ట్రానికి ప్రధానమంత్రి వచ్చే విషయంపై ప్రధాన కార్యదర్శి ఎస్‌కే సిన్హా సమావేశం ఏర్పాటు చేశారు. ఎస్‌పీజీ సిబ్బంది ఇప్పటికే చేరుకున్నారు. మార్చి 8న కొత్త ప్రభుత్వం ఏర్పాటు కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హాజరుకానున్నారు' అని సీనియర్ పోలీసు అధికారి పేర్కొన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి మానిక్ సాహా శుక్రవారం తన పదవికి రాజీనామా చేసి, లేఖను గవర్నర్ సత్యదేవ్ నారాయణ్ ఆర్యాకు సమర్పించారు. అనంతరం గవర్నర్ మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం మార్చి 8 ఏర్పాటు అవుతుందని, ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీ హాజరవుతారని ఆయన వివరించారు. ప్రమాణస్వీకార కార్యక్రమం స్థానిక వివేకానంద గ్రౌండ్‌లో జరగనున్నది. 'అసోం ముఖ్యమంత్రి హిమంత బిస్వ శర్మ ఇప్పటికే త్రిపుర చేరుకున్నారు మరోవైపు పార్టీ సీనియర్ నాయకులు, బీజేపీపాలిత ప్రాంత ముఖ్యమంత్రులు, కూడా ఈ కార్యక్రమంలో పాల్గొంటారు' అని రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షుడు రెబతి త్రిపుర తెలిపారు. కొత్తగా ఎన్నికైన సభ్యుల సమావేశంపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నబేంద్రు భట్టాచార్య తెలిపారు.

'ఏజింగ్ బ్లిస్‌ఫుల్'లో పూజాబేడీ, గురుముఖ్ కౌర్

న్యూఢిల్లీ: సెలబ్రిటీ యోగా గురు గురుముఖ్ కౌర్ ఖల్సా, నటి పూజా బేడీ, ఫ్యాషన్ డిజైనర్ సునీత్ వర్మ, టిబెటన్ రచయిత నామ్‌గ్యాల్ తక్లా "ఏజింగ్ బ్లిస్‌ఫుల్" అనే సమావేశంలో పాల్గొన్నారు. ఢిల్లీలోని నేషనల్ క్రాఫ్ట్ మ్యూజియం, హస్తకళ అకాడమీలో శనివారం ప్రారంభమైన రెండు రోజుల సమ్మేళనం, "జీవిత, వృద్ధాప్యం ఆనందాన్ని అంగీకరించడానికి, స్వీకరించడానికి, కనుగొనడానికి ప్రజలను ప్రోత్సహించడం" లక్ష్యంగా పెట్టుకుంది. ఈ కార్యక్రమం 'ది పాజిటివిటీ ప్రాజెక్ట్ ఫౌండేషన్' ద్వారా నిర్వహించబడింది. బీహార్ ప్రభుత్వం ఆర్ట్ అండ్ కల్చర్ మంత్రిత్వ శాఖ మద్దతుతో జరగ్గా, ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఆధ్యాత్మిక గురువులు, వెల్‌నెస్ నిపుణులు పాల్గొన్నారు. నిపుణులచే "వృద్ధాప్యం ఆనందంగా మరియు అందంగా ఉంటుంది" అని నొక్కిచెప్పే చర్చలు మరియు వర్క్‌షాప్‌లను కలిగి ఉంటుంది. శనివారం నాటి సెషన్‌లలో దలైలామా కోడలు, దేశంలోని సెంట్రల్ టిబెటన్ అడ్మినిస్ట్రేషన్ క్యాబినెట్‌లో ఆరోగ్య కార్యదర్శి, నటుడు అయిన నమ్‌గ్యాల్ లామో తక్లా రచించిన 'వృద్ధాప్యంలో మరణ భయాన్ని అధిగమించడం' అనే అంశంపై చర్చ, 'మీ వైఖరి మీ ఎత్తును నిర్ణయిస్తుంది' అనే అంశంపై పూజాబేడీ ప్రసంగిస్తారు. మార్చి 5న సెలబ్రిటీ స్కిన్ హీలర్, కాస్మోటాలజిస్ట్ డాక్టర్ దిన్యార్ బాక్సింగ్‌వాలా, జ్యోతిష్యుడు జై మదన్ ఉపన్యాసం, ధ్యానంపై వర్క్‌షాప్‌తో యొక్క ముఖ్యాంశాలు ఉంటాయి. భద్ర సిన్హా, గాయత్రి శర్మల భరతనాట్య ప్రదర్శనతో కార్యక్రమం ముగుస్తుంది.

త్రిపురలో ఎన్నికల అనంతరం హింస... ఎనిమిదిమందికి గాయాలు

అగర్తల: త్రిపుర ఎన్నికల అనంతరం జరిగిన హింసలో కనీసం ఎనిమిదిమంది గాయపడినట్టు శనివారం పోలీసులు తెలిపారు. దీనికి సంబంధం ఉన్న 20మందిని అరెస్టు చేసినట్టు పేర్కొన్నారు. శుక్రవారం జీబీపీ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న బాధితులను ముఖ్యమంత్రి మాణిక్ సాహా పరామర్శించారు. శాంతిభద్రతలు అదుపులోకి వచ్చేలా, నిందితులను పట్టుకుని కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఖోవాయ్, సెఫాహిజలా జిల్లాల్లోని ఎక్కువ కేసులు నమోదయ్యాయి. కొంతమంది వ్యక్తులు గాయపడగా వారిని దగ్గరలోని ఆస్పత్రికి తరలించారు. అయితే ఈ గొడవల్లో ఇంత వరకూ ఎవరూ మరణించలేదని అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ జ్యోతిమాన్‌దాస్ చౌదురి తెలిపారు. ఎన్నికల ఫలితాలు వెల్లడించిన అనంతరం రాష్ట్రం మొత్తంగా మీద ఇటువంటి సంఘటనలు సుమారు 70వరకూ జరిగాయని సమాచారం వచ్చిందని ఆయన వివరించారు. ఎన్నికల అనంతరం హింసపై అన్ని పోలీసుస్టేషన్‌లను హెచ్చరించామని, శాంతిని నెలకొల్పేందుకు స్థానిక అధికారులతో కలిసి పోలీసులు పనిచేస్తున్నారని ఆయన వివరించారు. సెఫాహిజలా, చరిలాం, సుతార్‌ముఠా, లాల్‌సింగ్‌మురాల్లో హింస రేకెత్తగా, సకాలంలో పోలీసులు స్పందించడంతో ఎక్కడి గొడవలు అక్కడ సర్దుకున్నాయి.

భారత్ పురోగమిస్తోంది : బిల్ గేట్స్

న్యూఢిల్లీ : ఆరోగ్యం, అభివృద్ధి, వాతావరణం వంటి రంగాలలో భారతదేశం సాధిస్తున్న పురోగతిని మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు, దాత బిల్ గేట్స్ ప్రశంసించారు. ఆవిష్కరణలో పెట్టుబడులు పెట్టినప్పుడు ఏమి సాధ్యమయ్యే వాటిని భారత్ చూపుతోందని అన్నారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న బిల్ గేట్స్... ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో శుక్రవారం సమావేశమయ్యారు. ఆరోగ్య రంగం, పర్యావరణ మార్పులు వంటి కీలక అంశాలపై ఇద్దరూ చర్చించారు. 'భారతదేశం ఎంతో సమర్థమై, భద్రమైన, అందుబాటు ధరల్లో ఉండే అనేక టీకాలను పెద్ద మొత్తంలో ఉత్పత్తి చేసింది. ఆ టీకాలు కరోనా సమయంలో లక్షల మంది ప్రాణాలను కాపాడటమే కాకుండా, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఇతర వ్యాధుల వ్యాప్తిని కూడా నివారించాయి. ఈ టీకాలను భారత్ ఉత్పత్తి చేయడంతో పాటు ఇతర దేశాలకు అందించి స్నేహబంధాన్ని చాటుకుంది. కోవిడ్ యాప్... ప్రపంచానికి ఒక నమూనా అవుతుందని ప్రధాని మోదీ విశ్వసించారు. దాన్ని నేనూ అంగీకరిస్తున్నా' అని గేట్స్ తన అధికారిక బ్లాగ్ ' గేట్స్ నోట్స్'లో కొనియాడారు. 'ప్రపంచానికి చాలా సవాళ్లు ఉన్న సమయంలో భారతదేశం వంటి చైతన్యవంతమైన, సృజనాత్మక ప్రదేశాన్ని సందర్శించడం స్ఫూర్తిదాయకంగా ఉంది' అని ఆయన తన బ్లాగ్‌లో పేర్కొన్నారు. మహమ్మారి కారణంగా గత మూడేళ్లుగా తాను పెద్దగా ప్రయాణించనప్పటికీ, తాను మోదీతో సన్నిహితంగా ఉన్నానని, ముఖ్యంగా కోవిడ్ టీకాలను అభివృద్ధి చేయడం, భారతదేశ ఆరోగ్య వ్యవస్థలలో పెట్టుబడులు పెట్టడం గురించి గేట్స్ చెప్పారు. మహమ్మారి సమయంలో భారతదేశం 200 మిలియన్ల మంది మహిళలతో సహా 300 మిలియన్ల మందికి అత్యవసర డిజిటల్ చెల్లింపులను బదిలీ చేసిందని ఆయన పేర్కొన్నారు. గతి శక్తి కార్యక్రమాన్ని ప్రశంసించిన గేట్స్, ప్రభుత్వాలు మెరుగ్గా పనిచేయడానికి డిజిటల్ టెక్నాలజీ ఎలా సహాయపడుతుందో చెప్పడానికి ఇదొక గొప్ప ఉదాహరణ అని అన్నారు. జి20 సదస్సుకు భారత్ అధ్యక్షత వహించడంపై స్పందిస్తూ... 'దేశంలోని నూతన ఆవిష్కరణల నుంచి ప్రపంచం ఎలా ప్రయోజనం పొందొచ్చే చెప్పేందుకు ఇది గొప్ప అవకాశం' అని ప్రశంసించారు. 'ప్రధానితో మాట్లాడిన తర్వాత ఆరోగ్యం, అభివృద్ధి, పర్యావరణం రంగాల్లో భారత్ సాధిస్తోన్న పురోగతి గురించి గతంలో కంటే మరింత ఆశావహ దృక్పథంతో ఉన్నా. మనం సృజనాత్మకత రంగంలో పెట్టుబడులు పెడితే ఏం సాధించగలమో భారత్ నిరూపిస్తోంది. ఈ పురోగతి ఇలాగే కొనసాగాలని, భారత్ తన ఆవిష్కరణలను ప్రపంచంతో పంచుకోవాలని ఆశిస్తున్నా' అంటూ గేట్స్ తన బ్లాగ్‌లో పేర్కొన్నారు.

మౌలిక సదుపాయాల అభివృద్ధి దూసుకెళ్లాలి

ఆర్థిక వ్యవస్థకు అదే చోదక శక్తి

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ : ఆర్థిక వ్యవస్థకు చోదక శక్తిగా ఉన్న భారతదేశ మౌలిక సదుపాయాల అభివృద్ధి దూసుకు వెళ్లవలసిన అవసరం ఉందని ప్రధాని నరేంద్ర మోదీ శనివారం తెలిపారు. బడ్జెట్ అనంతరం జరిగిన ఒక వెబినార్‌లో ఆయన ప్రసంగిస్తూ, ఈ ఏడాది బడ్జెట్ దేశంలో మౌలిక సదుపాయాల రంగం వృద్ధికి కొత్త శక్తిని అందిస్తుందని అన్నారు. మౌలిక సదుపాయాల అభివృద్ధిని ఆర్థిక వ్యవస్థకు చోదక శక్తిగా పరిగణిస్తున్నామని, ఈ మార్గాన్ని అనుసరించడం ద్వారా 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మారాలనే లక్ష్యాన్ని భారత్ సాధిస్తుందని మోదీ తెలిపారు. ఇప్పుడు ఈ అభివృద్ధి వేగాన్ని పెంచి దూసుకువెళ్లవలసిన అవసరం ఉందని దేశ మౌలిక సదుపాయాల ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి తన ప్రభుత్వం తీసుకున్న కార్యక్రమాలను గుర్తుచేసుకుంటూ ఆయన అన్నారు. ఇందులో ప్రధాన మంత్రి గతి శక్తి జాతీయ మాస్టర్ ప్లాన్ కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. జాతీయ మౌలిక సదుపాయాల పైప్‌లైన్ కింద రూ.110 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతున్నదని చెప్పారు. 'ఇది ప్రతి వాటాదారునికి కొత్త బాధ్యతలు, కొత్త అవకాశాలు, సాహసోపేతమైన నిర్ణయాల సమయం' అని ఆయన నొక్కి చెప్పారు.

రోడ్లు, రైల్వేలు, ఓడరేవులు, విమానాశ్రయాలు వంటి అన్ని రంగాల్లో ఆధునిక మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇది వ్యాపారాల పోటీతత్వాన్ని పెంపొందించడంలో, రవాణా ఖర్చును తగ్గించడంలో సహాయపడుతుందని తెలిపారు. 2013-14తో పోలిస్తే ప్రభుత్వ మూలధన వ్యయం 5 రెట్లు పెరిగిందని ప్రధాని అన్నారు. 'ఏ దేశ అభివృద్ధిలోనైనా మౌలిక సదుపాయాలు ఎప్పుడూ ముఖ్యమే. మౌలిక సదుపాయాలకు సంబంధించిన చరిత్రను అధ్యయనం చేసేవారికి ఈ విషయం బాగా తెలుసు' అని అనేక ఉదాహరణలను వివరించారు. దశాబ్దాలుగా పేదరికం ఒక సుగుణం అనే ఆలోచన భారతదేశంలో ఉందని, గత ప్రభుత్వాలు దేశ మౌలిక సదుపాయాలపై పెట్టుబడులు పెట్టడానికి ఇబ్బందులు ఎదుర్కొన్నాయని మోదీ అన్నారు. అయితే తమ ప్రభుత్వం ఈ ఆలోచన నుంచి దేశాన్ని బయటకు తీసుకురావడమే కాకుండా ఆధునిక మౌలిక సదుపాయాల కల్పనలో రికార్డు స్థాయిలో పెట్టుబడులు పెడుతోందని అన్నారు. ఫలితంగా, 2014 నుంచి జాతీయ రహదారుల సగటు వార్షిక నిర్మాణం దాదాపు రెట్టింపు అయ్యిందని, రైల్వే లైన్ల విద్యుదీకరణ 600 రూట్ కిలోమీటర్ల నుంచి 4 వేల రూట్ కిలోమీటర్లకు పెరిగిందని ఆయన అన్నారు.

2014లో 74 ఉన్న విమానాశ్రయాల సంఖ్య దాదాపు 150కి పెరిగిందని ఆయన ప్రధానంగా ప్రస్తావించారు. ఇది దేశ మౌలిక సదుపాయాలు, దాని బహుళ రవాణా ముఖాన్ని మార్చబోతోంది' అని తెలిపారు. 'నాణ్యత, బహుళ నమూనా సదుపాయాలతో రాబోయే రోజుల్లో మన రవాణా ఖర్చు మరింత తగ్గుతుంది. ఇది భారతదేశంలో తయారైన వస్తువులపై, మన ఉత్పత్తుల సామర్థ్యంపై సానుకూల ప్రభావం చూపుతుంది. రవాణా రంగంతో పాటు జీవన సౌలభ్యం, సులభతర వాణిజ్యంలో చాలా మెరుగుదల ఉంటుంది' అని అన్నారు. బలమైన సామాజిక మౌలిక సదుపాయాలు మరింత ప్రతిభావంతులైన, నైపుణ్యం కలిగిన యువతకు దారితీస్తాయని తెలిపారు. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు నైపుణ్యాభివృద్ధి, ప్రాజెక్టు నిర్వహణ, ఆర్థికపరమైన నైపుణ్యం, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అవసరమని ప్రధాన మంత్రి నొక్కి చెప్పారు. దేశంలోని మానవ వనరుల సమూహానికి ప్రయోజనం చేకూర్చడంతోపాటు వివిధ రంగాలకు చెందిన చిన్న, పెద్ద పరిశ్రమలకు సహాయపడే నైపుణ్యాన్ని అంచనా వేయడానికి ఒక యంత్రాంగాన్ని అభివృద్ధి చేయవలసిన అవసరాన్ని కూడా ఆయన నొక్కి చెప్పారు.

200 సీట్లు గెలుస్తాం: సంజయ్ రౌత్

పూనె: కస్బాపేట్ ఉప ఎన్నికలో మహావికాస్ అఘాడి(ఎంవీఏ) విజయం ఓ చిన్న ఝలక్ మాత్రమేనని, మిత్రపక్షాలన్నీ ఐక్యంగా పోరాడితే వచ్చే ఏడాది జరిగే సార్వత్రిక ఎన్నికల్లో 200 అసెంబ్లీ, 40 పార్లమెంట్ సీట్లను ఎంవీఏ గెలుచుకుంటుందని శివసేన(ఉద్ధవ్) నాయకుడు సంజయ్ రౌత్ చెప్పారు. ఎంవీఏలో జనసేన ఉద్ధవ్ పార్టీ, ఎన్‌సీపీ, కాంగ్రెస్ మిత్రపక్షాలుగా ఉన్న విషయం విదితమే. కొత్తగా ఎన్నికైన కాంగ్రెస్ ఎమ్మెల్యే రవీంద్ర ధంగేకర్‌ను కలవడానికి ఇక్కడికి వచ్చిన సంజయ్ రౌత్ మీడియాతో మాట్లాడారు. మూడు దశాబ్దాలుగా బీజేపీకి కంచుకోటగా నిలిచిన కస్బాపేట్ ఉప ఎన్నికల్లో ఎంవీఏ అభ్యర్థి ఘనవిజయం సాధించారు. తెలివిగల కస్బాపేట్ ఓటర్లు పాలక బీజేపీని దిమ్మతిరిగే దెబ్బ కొట్టారని, ఓటర్లను కొనుగోలు చేయడానికి ప్రయత్నించినా బీజేపీకి ఓటమి తప్పలేదని రౌత్ అన్నారు. కస్బా గెలుపు ఓ నమూనా మాత్రమే...రాష్ట్రంలో ఇదే ఫలితం వస్తుందని చెప్పారు. రాష్ట్ర రాజకీయ భవిష్యత్‌కు ఎంవీఏ విజయం ఓ సంకేతమని వ్యాఖ్యానించారు. బీజేపీ ఎమ్మెల్యేల మరణంతో కస్బాపేట్, చించ్వాడ స్థానాలకు ఉప ఎన్నిక జరిగింది. కస్బాపేట్‌ను కాంగ్రెస్ గెలుచుకోగా, చించ్వాడను బీజేపీ నిలబెట్టుకుంది. చించ్వాడ ఉప ఎన్నిక విజయం బీజేపీది కాదని రౌత్ చెప్పారు. చనిపోయిన లక్ష్మణ్ జగతప్ ప్రభావంతోనే బీజేపీ అక్కడ గెలుస్తూ వచ్చిందన్నారు. అభ్యర్థి ఎంపికలో ఎంవీఏ కొన్ని వ్యూహాత్మక తప్పిదాలు చేసిందని రౌత్ అంగీకరించారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి స్థానికంగానే పొత్తులపై నిర్ణయం తీసుకుంటారని ఆయన చెప్పారు. ఎంవీఏ అగ్రనేతలు మాత్రం అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలపై దృష్టి సారించారన్నారు. అందరం కలిసి పనిచేస్తూ రాష్ట్రంలో 200 ఎమ్మెల్యే సీట్లు తమవేనని దీమాగా చెప్పారు.

విద్య, వైద్యం వ్యాపారం కాదు: గెహ్లాత్

జైపూర్: విద్య, వైద్యాన్ని లాభదాయక రంగాలుగా భావించరాదని రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాత్ శనివారం చెప్పారు. ఆరోగ్య హక్కు బిల్లుపై అసెంబ్లీలో చర్చించాలని ప్రభుత్వం యోచిస్తోందని వెల్లడించారు. రాష్ట్ర ప్రజలకు ఆసుపత్రులు, క్లినిక్కులు, లాబొరేటరీల నుంచి ఉచిత సేవలు అందించాలని గెహ్లాత్ ప్రభుత్వం భావిస్తోంది. దీనికోసం రాజస్థాన్ ఆరోగ్య హక్కుల బిల్లుపై కసరత్తు చేస్తోంది. అయితే ఈ బిల్లును ప్రైవేట్ ఆసుపత్రి యాజమాన్యాలు, వైద్యులు వ్యతిరేకిస్తున్నారు. ప్రైవేట్ ఆసుపత్రి యాజమాన్యాల నిరసనపై ముఖ్యమంత్రి అసహనం వ్యక్తంచేశారు. బిల్లు ప్రాధాన్యత గురించి ప్రైవేట్ ఆసుపత్రి వైద్యులకు చెప్పాలని ప్రభుత్వ వైద్యులకు సీఎం విజ్ఞప్తి చేశారు. సవాయ్ మాన్‌సింగ్ మెడికల్ కాలేజీ ప్లాటినం జూబ్లీ కార్యక్రమంలో గెహ్లాత్ ప్రసంగిస్తూ విద్య, వైద్య రంగాలను వ్యాపారపరంగా, లాభదాయకంగా చూడవద్దని, ఆ విధంగా ఉపయోగించవద్దని విజ్ఞప్తి చేశారు. 'ఆరోగ్యరంగమంటేనే సేవారంగం. అందువల్ల ట్రస్టులు, సొసైటీలు ఆసుపత్రులు నిర్మిస్తుంటాయి. అయితే చాలా వైద్య సంస్థలు డబ్బు సంపాదనకు మార్గాలు అన్వేషిస్తున్నాయి. ఎంత సంపాదించినప్పటికీ బిల్లును వ్యతిరేకిస్తున్నాయి. బిల్లు ప్రాముఖ్యతను ఆ సంస్థలకు వివరించేందుకు ప్రయత్నిస్తాం' అని గెహ్లాత్ చెప్పారు. కోవిడ్ మహమ్మారి వేళ సవాయ్ మాన్‌సింగ్ ఆసుపత్రి గొప్ప సేవలందించిందని, చికిత్స కోసం ఇతర రాష్ట్రాల ప్రజలు కూడా ఇక్కడికి వచ్చారని తెలిపారు. దేశ ప్రజలకు సామాజిక భద్రత కల్పించే చట్టాన్ని కేంద్రం తీసుకురావాలన్న తన డిమాండ్‌ను గెహ్లాత్ పునరుద్ఘాటించారు. రాష్ట్రంలో కోటిమందికి తమ ప్రభుత్వం సామాజిక భద్రత కల్పిస్తున్నదని చెప్పారు.

వృద్ధుడి కాల్చివేత

మీరట్ (ఉత్తరప్రదేశ్): గుర్తు తెలియని వ్యక్తి 75 సంవత్సరాల వృద్ధుడిని కాల్చి హత్యచేసినట్టు పోలీసులు తెలిపారు. బ్రహ్మం సింగ్ తన కుమార్తెతో కన్‌కర్‌ఖెరా పోలీసుస్టేషన్ ప్రాంతంలో నివసిస్తున్నారు. హత్య జరిగిన సమయంలో ఆయన ఒంటరిగా ఉన్నట్టు స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఉత్తమ్‌సింగ్ రాథోడ్ తెలిపారు. మంచంపై పడుకున్న స్థితిలో మృతదేహాన్ని గుర్తించినట్టు పేర్కొన్నారు. 'ఉదయం పాలు తీసుకొచ్చేందుకు బ్రహ్మంసింగ్ కుమార్తె దగ్గరల్లో ఉన్న డెయిరీకి వెళ్లింది. ఆమె తిరిగి వచ్చే సరికి రక్తపుమడుగులో తండ్రిని గమనించింది' అని ఉత్తమ్ సింగ్ వివరించారు. గుర్తుతెలియని వ్యక్తిపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేశామని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి పంపినట్టు వివరించారు.

దేశంలో మార్పు అనివార్యం

ఇక బీజేపీకి చుక్కలే: పవార్



ముంబై: దేశవ్యాప్తంగా మార్పు కోసం రెక్కలు విప్పుకున్నాయని ఎన్‌సీపీ అధినేత శరద్ పవార్ చెప్పారు. ఇటీవల కస్బా పేట్ అసెంబ్లీ సీటుకు జరిగిన ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి చేతిలో బీజేపీ ఓటమే ఇందుకు నిదర్శనమని పవార్ తెలిపారు. దేశవ్యాప్తంగా ప్రజలు మార్పు కోరుకుంటున్నారని వ్యాఖ్యానించారు. పూనె జిల్లా బారామతిలో పవార్ శనివారం విలేకరులతో మాట్లాడారు. ప్రత్యామ్నాయాన్ని ప్రజలు కోరుకుంటున్నారనడానికి కస్బాలో ఓటమే నిదర్శనమని, దేశంలో మార్పు అనివార్యమని పవార్ అన్నారు. తనకు మంచి పట్టున్న కస్బా పేట్ సీటును తిరిగి గెలుచుకోవడంలో బీజేపీ విఫలమైంది. కాంగ్రెస్ అభ్యర్థి రవీంద్ర ధంగేకర్ ఎంవీఏ మిత్రపక్షాల అభ్యర్థిగా విజయం సాధించారు. ఈ స్థానాన్ని బీజేపీ, ప్రతిపక్ష ఎంవీఏ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. చివరికి ఎంవీఏ అభ్యర్థి గెలుపొందారు. గడచిన 28 ఏళ్ల నుంచి ఈ అసెంబ్లీ స్థానాన్ని బీజేపీ వరుసగా గెలుచుకుంటూ వస్తోంది. ప్రస్తుతం బీజేపీ పూనె ఎంపీగా ఉన్న గిరీశ్ బాపట్ బిస్బాపేట్ నుంచి 2019 వరకు వరుసగా గెలిచారు. కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, పంజాబ్, ఢిల్లీ, పశ్చిమబెంగాల్, కర్ణాటకలో బీజేపీ నామమాత్రమేనని, ప్రజలు ఓట్లు వేసే సమయానికి కాంగ్రెస్ ప్రభుత్వాలను బీజేపీ ఎలా కూల్చిందో గుర్తు చేసుకుంటారని పవార్ చెప్పారు. ఎన్నికల కమిషనర్ల నియామకంపై సుప్రీంకోర్టు తీర్పును ప్రజాస్వామ్యానికి మంచి నిర్ణయంగా అభివర్ణించారు. నాగాలాండ్ ఎన్నికల్లో ఎన్‌సీపీ మంచి పనితీరు కనబరిచిందని, 12 స్థానాల్లో పోటీ చేసి ఏడింటిని గెలుచుకుందని పవార్ చెప్పారు. నాగాలాండ్‌లో తాము రెండోస్థానంలో ఉన్నామని, పరిశీలకుడిగా పార్టీ ప్రధాన కార్యదర్శి నరేంద్రవర్మను నాగాలాండ్ పంపామని వివరించారు.

ఓట్ల చీలికతో లాభపడిన బీజేపీ: లెఫ్ట్‌ఫ్రంట్

అగర్తల: త్రిపుర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను ఊహించలేదని లెఫ్ట్‌ఫ్రంట్ తెలిపింది. ప్రభుత్వ వ్యతిరేక ఓట్ల చీలిక బీజేపీ స్వల్ప మెజారిటీతో గెలవడానికి దోహదపడిందని అభిప్రాయపడింది. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని 60శాతం మంది ఓటర్లు వ్యతిరేకించారని, 39 శాతం ఓట్లు మాత్రమే కాషాయపార్టీకి లభించాయని వ్యాఖ్యానించింది. ఐదేళ్ల బీజేపీ దుష్టపాలనను ప్రజలు సక్రమంగా అర్థం చేసుకుంటే ఫలితం ఇలా వచ్చేది కాదని పేర్కొంది. అయినా 60శాతం మంది ఓటర్లు బీజేపీకి వ్యతిరేకంగా ఉన్నారని లెఫ్ట్‌ఫ్రంట్ కన్వీనర్ నారాయణ్ కర్ ఓ ప్రకటనలో తెలిపారు. 2018 ఎన్నికలతో పోలిస్తే బీజేపీ ఓటు షేరు నాలుగు శాతానికి పైగా తగ్గిందని, సీట్ల సంఖ్య కూడా 36 నుంచి 32కి పడిపోయిందని ఆయన వివరించారు. ఈ ఎన్నికల్లో సీపీఎం ఓటు షేరు తగ్గిన కాంగ్రెస్ ఓట్లశాతాన్ని 1.41 నుంచి 8.56శాతానికి పెంచుకుంది. తిప్రా మోథా పార్టీ 20శాతం ఓట్లతో 13 సీట్లు గెలుచుకుంది. ప్రభుత్వ వ్యతిరేక ఓట్లను తిప్రా మోథా భారీగా చీల్చుకుంది. బీజేపీ వ్యతిరేక పార్టీల ఓట్లు చీలిపోయాయని, అందుకే స్వల్ప మెజారిటీతో కాషాయపార్టీ గెలిచిందని నారాయణ్ కర్ వివరించారు. కొన్ని ప్రాంతాల్లో జరుగుతున్న ఎన్నికల అనంతర హింసపై ఆయన ఆందోళన వెలిబుచ్చారు.

ధన్నీపూర్ మసీదు నిర్మాణానికి తుది అనుమతి

అయోధ్య మసీదు ప్రాజెక్టును ఆమోదించిన ఏడీఏ

అయోధ్య : బాబ్రీ మసీదు–రామ జన్మభూమి తీర్పులో సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఇక్కడ ధన్నిపూర్ మసీదు నిర్మాణానికి అయోధ్య అభివృద్ధి మండలి తుది అనుమతి ఇచ్చింది. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఇచ్చిన ఐదు ఎకరాల స్థలంలో ఇండో–ఇస్లామిక్ కల్చరల్ ఫౌండేషన్ (ఐఐసీఎఫ్) ట్రస్ట్ ద్వారా మసీదు, ఆసుపత్రి, పరిశోధనా సంస్థ, సామాజిక వంట శాల, లైబ్రరీని నిర్మించనున్నారు. అయోధ్య అభివృద్ధి మండలి (ఏడీఏ) ఆమోదం పెండింగ్‌లో ఉన్నందున, భూమి వినియోగాన్ని మార్చే విషయాల కారణంగా నిర్మాణం రెండేళ్లకు పైగా ఆలస్యం అయింది. 'శుక్రవారం జరిగిన బోర్డు సమావేశంలో మేము అయోధ్య మసీదు ప్రాజెక్టును ఆమోదించాము. మంజూరైన మ్యాప్‌లను ఇండో–ఇస్లామిక్ కల్చరల్ ఫౌండేషన్ (ఐఐసీఎఫ్) కి కొన్ని శాఖల లాంఛనాల తర్వాత అందజేస్తాము. అవి రెండు రోజుల్లో పూర్తవుతాయి' అని అయోధ్య డివిజనల్ కమిషనర్ గౌరవ్ దయాల్ పీటీఐకి తెలిపారు. అన్ని అనుమతులు వచ్చిన తర్వాత ట్రస్టు సమావేశం నిర్వహించి మసీదు నిర్మాణానికి సంబంధించిన ప్రణాళికను ఖరారు చేస్తామని ఐఐసీఎఫ్ కార్యదర్శి అథర్ హుస్సేన్ తెలిపారు. ఏప్రిల్ 21న ముగిసే రంజాన్ తర్వాత ట్రస్టు సమావేశం జరుగుతుందని, ఆ సమావేశంలో మసీదు నిర్మాణ పనులు ప్రారంభించే తేదీని ఖరారు చేస్తామని ఆయన చెప్పారు. 'మేము జనవరి 26, 2021న మసీదుకు శంకుస్థాపన చేశాము. ఈ రోజున, భారత రాజ్యాంగం ఏడు దశాబ్దాల క్రితం అమల్లోకి వచ్చినందున మేము ఆ రోజును ఎంచుకున్నాము' అని ఆయన చెప్పారు. 'ధన్నిపూర్ మసీదు బాబ్రీ మసీదు కంటే పెద్దదిగా ఉంటుంది. ఇది ఒకప్పుడు అయోధ్యలో ఉన్న నిర్మాణం తరహాగా రూపొందించబడదు' అని హుస్సేన్ తెలిపారు. యాత్రికుల పట్టణంలోని రామ మందిరం వేదిక నుంచి ధన్నిపూర్ మసీదు స్థలం సుమారు 22 కి.మీ దూరంలో ఉంది.

నవంబరు 9, 2019న ఒక చారిత్రాత్మక తీర్పులో అయోధ్యలోని వివాదాస్పద స్థలంలో రామ మందిరాన్ని నిర్మించాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. జిల్లాలోని ఒక ప్రముఖ ప్రదేశంలో మసీదు నిర్మాణానికి ఐదు ఎకరాల స్థలాన్ని కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరింది. ఐఐసీఎఫ్ ట్రస్ట్ మసీదు నిర్మాణంతో పాటు ఆసుపత్రి, సామాజిక వంటశాల, లైబ్రరీ, పరిశోధనా సంస్థను నిర్మించాలని దాని ప్రణాళికలను ప్రకటించింది. 1,400 సంవత్సరాల క్రితం ప్రవక్త బోధించిన ఇస్లాం నిజమైన స్ఫూర్తితో రాబోయే ఆసుపత్రి మానవాళికి సేవ చేస్తుందని హుస్సేన్ అన్నారు. 'ఆసుపత్రి సాధారణ కాంక్రీట్ నిర్మాణం కాదు. కానీ మసీదు వాస్తుశిల్పంతో సమకాలీకరించబడుతుంది. ఇది కాలిగ్రఫీ, ఇస్లామిక్ చిహ్నాలతో నిండి ఉంటుంది' అని ఆయన చెప్పారు. 'ఆసుపత్రి అనారోగ్యంతో ఉన్నవారికి చికిత్స చేస్తుంది. సామాజిక వంట శాల ఆకలితో ఉన్నవారికి, మతం, కులం వంటి అడ్డంకులు లేకుండా ఆహారం అందిస్తుంది. ఆ ప్రాంతంలోని గ్రీన్ బెల్ట్ వాతావరణ మార్పులపై అవగాహన కల్పిస్తుంది. అలాగే పరిశోధనా సంస్థ స్వాతంత్ర్య పోరాటంలో ముస్లింల సహకారం, భారతదేశానికి స్వాతంత్ర్యం సాధించడంలో సహాయపడిన హిందూ–ముస్లిం సోదరుల వారసత్వాన్ని అధ్యయనం చేస్తుంది' అని ఐసీఎఫ్ కార్యదర్శి తెలిపారు. కాగా, నగరంలో రామమందిర నిర్మాణం శరవేగంగా సాగుతోంది. 2024 జనవరిలో ఆలయాన్ని భక్తుల కోసం తెరుస్తామని ఆలయ నిర్మాణాన్ని చేపడుతున్న ట్రస్ట్ శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర అధికారులు పేర్కొన్నారు. అదే ఏడాదిలో దేశం తదుపరి సార్వత్రిక ఎన్నికలను ఎదుర్కోనుంది.

రాజకీయ రౌడీయిజాన్ని అణచివేద్దాం

- అధికార దుర్వినియోగాన్ని న్యాయవాదులు అడ్డుకోవాలి
- టీడీపీ లీగల్‌సెల్ రాష్ట్ర సమావేశంలో చంద్రబాబు పిలుపు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాజకీయ రౌడీయిజాన్ని భూస్థాపితం చేసేందుకు, అధికార దుర్వినియోగాన్ని అడ్డుకునేందుకు న్యాయవాదులు ముందుండాలని టీడీపీ అధినేత చంద్రబాబు పిలుపునిచ్చారు. వైసీపీ ప్రభుత్వ అరాచకాలను ఎదుర్కొంటూ పార్టీకి అండగా నిలిచే ప్రతి న్యాయవాదికి అధికారంలోకి రాగానే ప్రాధాన్యత కల్పిస్తామని హామీ ఇచ్చారు.శనివారం జరిగిన టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర సమావేశంలో చంద్రబాబు మాట్లాడుతూ ప్రభుత్వ అక్రమ కేసుల నుంచి నాలుగేళ్లుగా టీడీపీ నేతలను, కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుతున్న న్యాయవాదులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ధనవంతులు కాకుండా...విద్యావంతులు రాజకీయాల్లోకి రావాలనేది టీడీపీ సిద్ధాంతమన్నారు. తొలి ఎన్నికల్లో 20 మంది డాక్టర్లు, 8 మంది ఇంజినీర్లు, 125 మంది గ్రాడ్యుయేట్లు, 28 మంది పోస్ట్ గ్రాడ్యుయేట్లు, దాదాపు 47 మంది న్యాయవాదులకు టికెట్లు ఇచ్చిన చరిత్ర టీడీపీదని గుర్తు చేశారు. యనమల, బాలయోగి, ఎర్రంనాయుడు, ఆలపాటి రాజేంద్రప్రసాద్, నక్కా ఆనంద్ బాబు వంటి అనేక మంది నేతలు న్యాయవాదులుగా పనిచేశారు. ఒకప్పుడు టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షుడిగా ఉన్న కనకమేడల ఇప్పుడు ఎంపీగా ఉన్నారని గుర్తు చేశారు. తాను 1978 నుంచి శాసనసభ్యుడిగా ఉన్నాను. కానీ ఎప్పుడూ రాష్ట్రంలో ఇలాంటి పరిస్థితి చూడలేదు. 40 ఏళ్లలో అనేక పోరాటాలు చేశాము... ఇంత దారుణ పాలన ఎప్పుడూ లేదు. వైసీపీ అరాచక పాలన వల్ల న్యాయవాదులకు మాత్రం పని భారం పెరిగింది. ఇతర వ్యవస్థలు అన్నీ ధ్వంసమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. తన డ్రైవర్ సుబ్రహ్మణ్యంను ఎమ్మెల్సీ అనంతబాబు చంపి భౌతికకాయాన్ని ఇంటికి తెచ్చింది కాక...అంత్యక్రియలకు డబ్బులు ఇస్తామని చెప్పారు అంటే రాష్ట్రంలో పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవాలన్నారు. సొంత పార్టీ అయినా ఎంపీ రఘురామకృష్ణరాజు, ఒంగోలు సుబ్బారావు గుప్తాలను ఎలా వేధించారో మనందరికీ తెల్సిందేనన్నారు. వరుసగా టీడీపీ నేతలపై రాష్ట్రవ్యాప్తంగా జరిగిన దౌర్జన్యాలు, అక్రమ కేసులు, హత్యకాండకు లెక్కే లేదన్నారు. బ్రిటిష్ వాళ్లు కూడా ఇంత దారుణంగా వ్యవహరించలేదన్నారు. సీఐడీ అధికారి సునీల్ కుమార్ దారుణాలకు అంతు లేదన్నారు. అందువల్ల న్యాయవాదులు సమాజంలో జరిగే అన్యాయంపై గట్టిగా పోరాడాలని, మీరు మీ క్లయింట్‌ను కాపాడడానికి ఎంత దూరమైనా వెళ్లవచ్చన్నారు. ఆర్కిటెక్చర్ డైజెస్ట్ అనే మ్యాగజైన్ ప్రపంచంలోని గొప్ప నగరాలపై ఆర్టికల్ ప్రచురించింది. ఇందులో 6వ స్థానం అమరావతికి స్థానం దక్కింది. మనం శాశ్వతం కాకపోవచ్చు...కానీ రాష్ట్రం శాశ్వతమనే ఉద్దేశంతో పనిచేశాం. సింగపూర్ అనేది నిజాయతీగా ఉండే దేశం. అక్కడ కారు డ్రైవర్ టిప్ కూడా తీసుకోరు. అమరావతి విషయంలో అలాంటి దేశంపై వైసీపీ నేతలు ఆరోపణలు చేశారు. ప్రపంచంలో అతిపెద్ద అవినీతిపరుడు అయిన జగన్....సింగపూర్‌పై ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నాలుగేళ్లలో ఒక్క రూపాయి కూడా పెట్టుబడి తేలేకపోయిన సీఎం జగన్ రెడ్డి. దశాబ్దాల పాటు కష్టపడి ఆస్తులు సంపాదించుకున్న ప్రజలను బెదిరించి ఆస్తులు రాయించుకుంటున్నారని చంద్రబాబు మండిపడ్డారు. ఇటువంటి అరాచకాలపై ప్రజల తరపున పోరాటానికి టీడీపీ సిద్ధంగా ఉంది...వారికి న్యాయవాదులు అండగా ఉండాలని కోరారు. జగన్ రెడ్డి నైతికంగా పతనమయ్యాడు. ఎప్పుడో ఓడిపోయాడు. ఇంకా బుకాయిస్తే జగన్ చరిత్రహీనుడిగా మిగిలిపోతాడు. ఈ 5 ఏళ్లు ఏ న్యాయవాది అయితే టీడీపీకి అండగా ఉన్నాడో...అధికారంలోకి వచ్చిన తరువాత వారందరికీ న్యాయం చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. రాజకీయ పోరాటంతో పాటు న్యాయపోరాటం కూడా చేయాల్సి ఉందని, ఇందుకోసం సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించుకుందామని పిలుపునిచ్చారు.

ఏపీలో క్యాన్సర్ చికిత్సకు ఉత్తమ చర్యలు

- దసరాకు అందుబాటులోకి తిరుపతి క్యాన్సర్ కేర్
- డాక్టర్ నోరి దత్తాత్రేయుడు వెల్లడి

విశాలాంధ్ర -గుంటూరు వైద్యం: క్యాన్సర్ రోగులు వైద్యం కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లాల్సిన అవసరం ఇకపై ఉండదని, ఏపీలోనే చికిత్స పొందవచ్చని ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రభుత్వ సలహాదారుడు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు తెలిపారు. గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి (జీజీహెచ్)లోని నాట్కో క్యాన్సర్ సెంటర్‌ను ఆయన శనివారం పరిశీలించారు. కొన్ని విభాగాలను సందర్శించి వాటి పనితీరును సమీక్షించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కార్పొరేట్ ఆసుపత్రుల్లో క్యాన్సర్ చికిత్స ఖరీదుతో కూడుకున్నదని, రోగులపై వైద్యవ్యయాన్ని తగ్గించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. తిరుపతి, కర్నూలు, విశాఖపట్నం, గుంటూరు ప్రాంతాల్లో క్యాన్సర్ కేర్ ఆసుపత్రులను నిర్మిస్తున్నట్లు తెలిపారు. క్యాన్సర్ రోగులకు అత్యుత్తమ చికిత్స అందించడమే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. తిరుపతిలో బాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ కేర్ సెంటర్ దసరా నాటికి అందుబాటులోకి రానున్నట్లు చెప్పారు. అంతర్జాతీయ ప్రమాణాలతో వీటిని తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. కర్నూలు, విశాఖపట్నంలోని క్యాన్సర్ కేర్ సెంటర్‌లకు అవసరమైన యంత్రాలు, పరికరాలను సమాకూర్చి రోగులకు చికిత్సను అందుబాటులోకి తెస్తామన్నారు. క్యాన్సర్ రోగులకు ఆరోగ్యశ్రీ ద్వారా అన్ని రకాల చికిత్సలు అందిస్తున్నట్లు చెప్పారు. పాన్, గుట్కా లాంటి పొగాకు ఉత్పత్తుల వినియోగం క్యాన్సర్‌కు దారితీస్తాయని, వాటిని నివారించాలని సూచించారు. సమావేశంలో వైద్య కళాశాల ప్రిన్సిపల్ సీహెచ్ పద్మావతి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి, డీఎంహెచ్ఓ డాక్టర్ ఎ.శ్రవణ్ కుమార్, డాక్టర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సమస్యలపై గొంతెత్తే

కత్తి, పోతులను గెలిపించండి

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల పిలుపు

విశాలాంధ్ర - నంద్యాల/పాములపాడు: రాష్ట్రంలో ఈ నెల 13న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్, ప్రజా సంఘాలు బలపరుస్తున్న ఉపాధ్యాయ, పట్టభద్రుల అభ్యర్థులు కత్తి నరసింహారెడ్డి, పోతుల నాగరాజును గెలిపించాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. వామపక్ష ప్రజాసంఘాలతో నంద్యాల జిల్లాలో కత్తి, పోతులకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్, వైసీపీ అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఎన్నికలలో గెలిచేందుకు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. అనునిత్యం ప్రజా సమస్యలపై గళాన్ని వినిపిస్తున్న వామపక్ష, ప్రతిపక్షాలను అడ్డగోలు జీవోలు తెచ్చి నిరసనలు, ధర్నాలు చేయకుండా, ప్రజా సమస్యల మీద పోరాడకుండా కేసులు పెడుతూ నియంతలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. గతంలో సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో ప్రతిపక్షాల అభ్యర్థులను నామినేషన్ వేయకుండా తమ కార్యకర్తలను, పోలీసులను వినియోగించి అడ్డగోలుగా ఏకగ్రీవాలు చేసుకొన్నారని గుర్తుచేశారు. ఇప్పుడు ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా అలాంటి చర్యలకు పాల్పడి తమ అభ్యర్థులను గెలిపించుకోవాలనీ దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రజల భద్రత కన్నా తన భద్రత, తన కుటుంబ భద్రత ముఖ్యమని జగన్ వ్యవహరిస్తున్నారని చెప్పారు. ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డిని, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజుకు మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు మాట్లాడుతూ, ఎమ్మెల్సీ ఎన్నికలను కూడా సాధారణ ఎన్నికల్లా నిర్వహిస్తూ ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్న అధికార పార్టీ అభ్యర్థులపై ఎన్నికల కమిషన్ తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని ప్రైవేట్ ఉపాధ్యాయుల పేరుతో అర్హత లేని వారికి ఓటర్లుగా నమోదు చేసుకుని వారి ద్వారా డబ్బులు పంపిణీ చేసి తమ అభ్యర్థులను గెలిపించుకోవాలని చూస్తున్నారని కాబట్టి ఉ ఉపాధ్యాయులు ఆలోచించి తమ సమస్యల కోసం పోరాడుతున్న కత్తి నరసింహారెడ్డిని, పోతుల నాగరాజును గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రమేష్ బాబు, ఎస్టీయూ జిల్లా నాయకులు రత్నం, ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు శ్రీనివాసులు, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర నాయకులు నాగమధు యాదవ్, నాయకులు రఘురామమూర్తి, ప్రజా సంఘం నాయకులు స్వామన్న, హనుమంతు, వెంకటేశ్వరరావు ప్రజా సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అదానీకి గుత్తాధిపత్యం ఎలా ఇస్తారు

మోదీకి కాంగ్రెస్ సూటి ప్రశ్న

న్యూఢిల్లీ: విమానాశ్రయాలు, విద్యుత్ వంటివి వసతులు వినియోగించే వారిని నిలు వున దోచుకునేలా అదానీ గ్రూపుకు గుత్తాధి పత్యాన్ని కేంద్రం ఎలా ఇచ్చిందని కాంగ్రెస్ ప్రశ్నించింది. అదానీ వ్యవహారంలో జేపీసీ డిమాండు ప్రధాని మోదీని అవమానించేం దుకు కాదని, పూర్తిగా వాస్తవాలు వెలుగు లోకి తేవడం కోసమేనని స్పష్టతిచ్చింది. 'హమ్ అదానీ కే హై కౌన్' సిరీస్‌లో భాగంగా మోదీకి మూడు ప్రశ్నలను కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ సంధిం చారు. అదానీ నిర్వహించే లక్నోలోని చౌదరి చరణ్ సింగ్ అంతర్జాతీయ విమానాశ్రయం దేశంలోని 11వ అత్యంత రద్దీగా ఉంటే విమానాశ్రయమని, వినియోగదారులు చెల్లించే యూజర్ డెవలప్‌మెంట్ ఫీ (యూడీఎఫ్)ను అమాంతరం పెంచేసింద న్నారు. విమానాశ్రయాల ఆర్థిక నిర్వహణ యంత్రాంగం (ఏఈఆర్) ఆమోదిస్తే 2025- 26 నాటికి వినియోగదారు రుసుము రూ.192 నుంచి రూ.1,025కు (దేశీయ ప్రయాణికులకు), రూ.561 నుంచి రూ.2,756 (అంతర్జాతీయ ప్రయాణికులకు) పెరుగుతుందని తెలిపారు.

ఇప్పటికే అదానీ పరిధిలోని అహ్మదాబాద్ విమానాశ్రయంలో దేశీయ ప్రయాణికుల యూడీఎఫ్‌ను ఆరు రెట్లు, అంతర్జాతీయ ప్రయాణికుల రుసు మును 12 రెట్లు పెంచడాన్నీ ఏఈఆర్ఏ ఆమోదించింది. మంగళూరు విమానాశ్ర యంలో డిపార్టింగ్ ప్రయాణికులకే కాకుండా ఎరైవింగ్ ప్రయాణికులకూ రుసుమును రుద్దడంలో ఏఈఆర్ఏ తన స్థాయికి మించి వ్యవహరించింది. అదానీ గ్రూపుకు గుత్తాధా పత్యాన్ని మోదీ ప్రభుత్వం కల్పించడం వల్ల కదా ఇదంతా జరిగేది? ఆరు విమానాశ్ర యాలను తన మిత్రుడైన గౌతం అదానీకి మోదీ కట్టబెట్టేశారు. నీతి ఆయోగ్, ఆర్థిక శాఖ అభ్యంతరాలనూ పట్టించుకోలేదు. మీ క్రోనీలు బీజేపీకిచ్చే ఎలక్టోరల్ బాండ్ల కోసం వినియోగదారులు తమ జేబులను గుల్ల చేసుకోవాలా? అని రమేశ్ నిలదీశారు. అదానీ పవర్‌తో విద్యుత్ కొనుగోలు ఒప్పందం (పీపీఏ) కుదుర్చుకోవడాన్ని ప్రశ్నించారు. బీజేపీ ఎలక్టోరల్ బాండ్ల కోసం చెల్లించేందుకు హరియాణా వినియోగదారుల నుంచి ఎన్ని కోట్ల రూపాయాలను దోచుకుంటారు? మీ క్రోనీలకు ఊతమిచ్చేందుకు సీఎం కట్టర్‌పై ఒత్తిడి తెచ్చారా? అని మోదీపై జైరాం రమేశ్ వరుస ప్రశ్నలు సంధించారు.

ఫైనల్స్‌కు ఏపీ సాఫ్ట్‌బాల్ పురుష, మహిళల జట్లు

విశాలాంధ్ర-రాప్తాడు: తమిళనాడులోని తిరుచ్చిలో ఈనెల 3 నుంచి 5వరకు జరిగిన 19వ సౌత్ జోన్ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఏపీ పురుష, మహిళల జట్లు అత్యద్భుతమైన ప్రతిభ కనబరిచి గ్రాండ్ ఫైనల్‌కు చేరుకున్నాయని ఏపీ సాఫ్ట్‌బాల్ సీఈఓ సి.వెంకటేసులు తెలిపారు. ఇటీవలి కాలంలో గుజరాత్‌లో జరిగిన జాతీయ క్రీడల్లో ఆంధ్రప్రదేశ్ పురుషుల సాఫ్ట్‌బాల్ టీం తృతీయ స్థానం సాధించిందన్నారు. అదేవిధంగా ఒడిశాలో జరిగిన సీనియర్ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో కూడా ఏపీ పురుషుల సాఫ్ట్‌బాల్ టీం గెలుపొందిందని వివరించారు. ఈ సౌత్ జోన్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో కూడా కచ్చితంగా ఆంధ్రప్రదేశ్ పురుష, మహిళల జట్లు ప్రథమస్థానం సాధిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్-23కు 'సూరీడు'

హైదరాబాద్: ఓ సామాన్యుడి జీవితంలో జరిగిన అనేక ఆసక్తికరమైన సంఘటనల ఆధారంగా ప్రయోగాత్మక చిత్రాల దర్శకుడు డా॥ పీసీ ఆదిత్య దర్శకత్వంలో మహాబోధి క్రియేషన్స్ బ్యానర్‌పై భూతం విమల నిర్మించిన 'సూరీడు' చిత్రం ఇండియన్ వరల్డ్ ఫిల్మ్ ఫెస్టివల్-23కు ప్రదర్శన నిమిత్తం ఎంపిక చేశారు. ప్రముఖ రచయిత భూతం ముత్యాలు ప్రత్యేక పాత్రలో నటించారు. ప్రముఖ సినీ, టీవీ నటీనటులు శివాజీ రాజా, లక్ష్మీరాజ్, ఆచార్య కృష్ణ, స్వప్న, సుష్మ, నైనిక, మాస్టర్ చరణ్ తదితరులు నటించారు. ఈనెల 19న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు హైదరాబాద్‌లోని అశోక్ హోటల్‌లో ఎంపికైన చిత్రాలను ప్రదర్శిస్తారు. అనంతరం విజేతల ప్రకటన ఉంటుంది. తొలి ప్రయత్నంలోనే 'సూరీడు' చిత్రం ఎంపికవడం అదృష్టమని నిర్మాత బీ విమల హర్షం వ్యక్తం చేశారు. ఈ చిత్ర రచయిత భూతం ముత్యాల స్పందిస్తూ తన కథ 'సూరీడు' ఫిల్మ్ ఫెస్టివల్‌కు ఎంపిక కావడంపై తనలోని రచయితకు ఎంతో ప్రోత్సాహమన్నారు. దర్శకుడు పీసీ ఆదిత్య స్పందిస్తూ 2023లో 'సూరీడు' ఫిల్మ్‌ఫెస్టివల్‌లో ప్రదర్శిస్తున్నందుకు ఆనందం వ్యక్తం చేశారు.

ఎన్‌టీఆర్-30కి హాలీవుడ్ టెక్నీషియన్స్?

హైదరాబాద్: జూనియర్ ఎన్టీఆర్, దర్శకుడు కొరటాల శివ రాబోయే చిత్రం ఎన్‌టీఆర్-30 షూటింగ్ త్వరలోనే మొదలవబోతోందని తెలిసింది. ఈ సినిమాని జూనియర్ ఎన్టీఆర్ అన్నయ్య నందమూరి కళ్యాణ్ రామ్ నిర్మిస్తున్నారు. అయితే 'ఆర్.ఆర్.ఆర్' సినిమాతో వచ్చిన క్రేజ్ చూసి, ఈ ఎన్‌టీఆర్-30 సినిమాని పాన్ ఇండియా లెవెల్‌లో ఏమాత్రం తగ్గకుండా తీయడానికి ప్లాన్ చేస్తున్నారని తెలిసింది. ఇప్పటికే రత్నవేలు, సాబు సిరిల్ లాంటి టెక్నీషియన్స్ పేర్లు ప్రకటించినప్పటికీ, ఈ సినిమాకి మాత్రం చాలామంది హాలీవుడ్‌కి చెందిన వాళ్లు పని చేస్తున్నారని తెలిసింది. దర్శకుడు కొరటాల శివ సుమారు ఆరు నెలలు ప్రీ ప్రొడక్షన్‌కి కావాలనే తీసుకున్నాడని తెలుస్తోంది.

సిరాజ్‌పై వేటు... షమీ రీఎంట్రీ

హైదరాబాద్: బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో తొలి పరాజయాన్ని చవిచూసిన టీమిండియా ఫైనల్ పోరుకు సిద్ధమవుతోంది. ఊహించని ఓటమి.. భారత జట్టు లొసుగులను బయట పెట్టింది. దాంతో తమ తప్పిదాలపై సీరియస్‌గా ఫోకస్ పెట్టిన రోహిత్ సేన.. అహ్మదాబాద్ వేదికగా గురువారం నుంచి ప్రారంభం కానున్న చివరి టెస్ట్‌కు సమయాత్తం అవుతోంది. ఈ సిరీస్ గెలవాలన్నా.. డబ్ల్యూటీసీ ఫైనల్ చేరాలన్నా ఈ మ్యాచ్ గెలవడం టీమిండియాకు తప్పనిసరి. ఇండోర్ పిచ్‌కు ఐసీసీ పూర్ రేటింగ్ ఇవ్వడంతో అహ్మదాబాద్ వేదికగా ఎలాంటి పిచ్ సిద్ధం చేస్తారనేది ఆసక్తికరంగా మారింది. మరోవైపు సమష్టి ప్రదర్శనతో విజయాన్నందుకున్న ఆసీస్ అదే జోరులో అహ్మదాబాద్ టెస్ట్ గెలిచి సిరీస్ సమం చేయాలనుకుంటుంది.

శుభ్‌మన్ గిల్‌కు మరో చాన్స్

పేలవ ఫామ్‌తో విఫలమవుతున్న కేఎల్ రాహుల్‌ను కాదని శుభ్‌మన్ గిల్‌ను ఆడిస్తే అతను దారుణంగా విఫలమయ్యాడు. గింగిరాలు తిరిగిన వికెట్‌పై అందరి బ్యాట్స్‌మెన్‌లానే తడబడ్డాడు. అయితే అతనికి మరో అవకాశం ఇవ్వనున్నారు. దాంతో కేఎల్ రాహుల్ మరోసారి బెంచ్‌కే పరిమితం కానున్నాడు. అయితే కీపింగ్‌లో ఆకట్టుకుంటున్నా.. బ్యాటింగ్‌లో తడబడుతున్న కేఎస్ భరత్ స్థానంలో రాహుల్‌ను ఆడించాలనుకుంటే మాత్రం తెలుగు ప్లేయర్‌పై వేటు పడనుంది. కీపింగ్‌కే ప్రాధాన్యత ఇస్తే మాత్రం కేఎస్ భరత్ జట్టులో కొనసాగుతాడు.

ఈ ఒక్క మార్పు తప్ప

శుభ్‌మన్ గిల్.. రోహిత్ శర్మతో కలిసి ఓపెనింగ్ చేయనుండగా.. మిడిలార్డర్‌లో చతేశ్వర్ పుజారా, విరాట్ కోహ్లి, శ్రేయస్ అయ్యర్ బరిలోకి దిగుతారు. మూడో టెస్ట్‌లో పుజారా, అయ్యర్ పర్వాలేదనిపించినా.. కోహ్లి దారుణంగా విఫలమయ్యాడు. అతని పేలవ ఫామ్‌పై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలోనే కోహ్లికి చివరి టెస్ట్ కీలకంగా మారింది. ఆ తర్వాత జడేజా, కేఎస్ భరత్, అక్షర్ పటేల్ ఆడనున్నారు. మూడో టెస్ట్‌లో బ్యాటింగ్ పరంగా అక్షర్ పటేల్ సేవలను టీమిండియా సరిగ్గా వాడుకోలేకపోయింది. తొలి రెండు టెస్ట్‌ల్లో సత్తా చాటిన జడేజా ఇండోర్‌లో మాత్రం తేలిపోయాడు. కేఎస్ భరత్ కీపింగ్‌లో అదరగొడుతున్నా.. బ్యాటింగ్‌లో మాత్రం తీవ్రంగా నిరాశపరుస్తున్నాడు. అతను బ్యాటింగ్ మెరుగుపరుచుకోవాల్సి ఉంది.

తుది జట్టు (అంచనా)

రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్, చతేశ్వర్ పుజారా, విరాట్ కోహ్లి, శ్రేయస్ అయ్యర్, కేఎస్ భరత్(కీపర్), రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్, మహమ్మద్ షమీ, మహమ్మద్ సిరాజ్/ఉమేశ్ యాదవ్.

మహమ్మద్ సిరాజ్‌పై వేటు

విన్నింగ్ కాంబినేషన్‌ను కాదని రెండు మార్పులతో ఇండోర్ టెస్ట్ బరిలోకి దిగిన టీమిండియా భారీ మూల్యం చెల్లించుకుంది. కేఎల్ రాహుల్ స్థానంలో వచ్చిన శుభ్‌మన్ గిల్ సైతం పేలవ ప్రదర్శన కనబర్చాడు. మహమ్మద్ షమీ స్థానంలో బరిలోకి దిగిన ఉమేశ్ యాదవ్ మాత్రం బౌలింగ్‌తో పాటు బ్యాటింగ్‌లోనూ ఆకట్టుకున్నాడు. దాంతో అతను చివరి టెస్ట్‌లోనూ అవకాశం అందుకోనున్నాడు. మరోవైపు వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా మూడో టెస్ట్ నుంచి మహమ్మద్ షమీకి విశ్రాంతి ఇవ్వగా.. అతను ఆఖరి టెస్ట్‌లో రీఎంట్రీ ఇవ్వనున్నాడు. అప్పుడు హైదరాబాద్ పేసర్ మహమ్మద్ సిరాజ్ బెంచ్‌కే పరిమితం కానున్నాడు. టర్నింగ్ ట్రాక్స్ కావడంతో మూడు మ్యాచ్‌ల్లో సిరాజ్ ఫీల్డింగ్‌కే పరిమితమయ్యాడు. మూడు మ్యాచ్‌ల్లో ఒకే ఒక్క వికెట్ తీశాడు. దాంతో సిరాజ్‌ను ఆఖరి టెస్ట్‌కు పక్కనపెట్టనున్నారు.

ప్లే.. కుల్దీప్ యాదవ్

బౌలింగ్ విభాగంలోనూ టీమిండియా పెద్దగా మార్పులు చేసే చాన్సే లేదు. అశ్విన్, జడేజా స్పిన్ బౌలింగ్‌లో కీలకం కాగా.. అక్షర్ పటేల్ బౌలింగ్‌తో పాటు లోయరార్డర్‌లో కీలక పరుగులు చేస్తుండటంతో ఈ ముగ్గురిని జట్టులో తప్పకుండా కొనసాగించనున్నారు. అహ్మదాబాద్‌లో అక్షర్ పటేల్‌కు బౌలింగ్ పరంగా మంచి రికార్డు ఉంది. ఇండోర్ వికెట్‌కు ఐసీసీ పూర్ రేటింగ్ ఇచ్చిన నేపథ్యంలో కాస్త బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉండే పిచ్‌ను అహ్మదాబాద్‌లో సిద్ధం చేయనున్నారు. దాంతో టీమిండియా ముగ్గురు స్పిన్నర్లు, ఇద్దరు పేసర్లతో బరిలోకి దిగనుంది. కుల్దీప్ యాదవ్ మరోసారి బెంచ్‌కే పరిమితం కానున్నాడు. అశ్విన్ ఏమైనా ఫిట్‌నెస్ సమస్యలు ఎదుర్కొంటే మాత్రం కుల్దీప్ జట్టులోకి వస్తాడు. మ్యాచ్ ప్రారంభమయ్యే వరకు ఎవరైనా గాయపడితే బెంచ్ ఆటగాళ్లకు అవకాశం దక్కుతుంది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.